ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
శనివారం 14 జూన్ 2025

## 45 మంది డిప్యూటీ తహసీల్దార్లు.. 28 మంది ఆర్ఐల బదిలీ

రాయచోటి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : పరిపాలనా సౌలభ్యం కోసం శుక్రవారం రాత్రి జిల్లాలో 45 మంది డిప్యూటీ తహసీల్దార్లు, 28 మంది రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేశారు. ఈ మేరకు కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఉత్తర్వులు జారీ చేశారు. కూటమి ప్రభుత్వంలో ఇంతమంది ఒకేసారి బదిలీ కావడం ఇదే మొదటిసారి.

## రాయచోటి ఈద్గాకు ప్రహరీ నిర్మించండి

● మంత్రి ఫరూక్‌ను కోరిన మంత్రి మండిపల్లి


మైనార్టీ శాఖ మంత్రి ఫరూక్‌తో సమావేశమైన మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన రాయచోటిలోని ఈద్గా స్థలానికి ప్రహరీ నిర్మించాలని రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ను మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి కోరారు. శుక్రవారం అమరావతిలోని సచివాలయంలో మంత్రి ఫరూక్‌ను రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇద్దరు మంత్రుల మధ్య శాఖల అభివృద్ధిపై చర్చలు జరిగాయి. రాయచోటి పట్టణంలోని నూతన షాదీఖానా నిర్మాణంతో పాటు రంజాన్, బక్రీద్ పండుగల సమయాల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించే పాత ఈద్గాలో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి ఇది వరకే బోరు వేయించి మోటారు బిగించి నీటి సౌకర్యం కల్పించారు. అలాగే పాత ఈద్గా చుట్టూ ప్రహరీ నిర్మాణం కోసం మైనార్టీ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌తో చర్చించారు. దీనిపై మంత్రి ఎన్ఎండీ ఫరూక్ వెంటనే సానుకూలంగా స్పందించారు. మంత్రి రాంప్రసాద్‌రెడ్డి వెంట టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్ బాషా ఉన్నారు.

## యోగాతో ఆరోగ్యం, మానసిక ప్రశాంతత



వెలిగల్లు ప్రాజెక్టు పార్కులో యోగా చేస్తున్న దృశ్యం

గాలివీడు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): యోగా ద్వారానే మనిషికి మంచి ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందని మండల స్పెషలాఫీసర్, ఉపాధి పీడీ వెంకటరత్నం, తహసీల్దార్ భాగ్యలత తెలిపారు. శుక్రవారం మండలంలోని వెలిగల్లు ప్రాజెక్టు పార్కులో మెగా యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత దైనందిన జీవితంలో మానసిక ప్రశాంతత కొరవడిందని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఉదయం, సాయంత్రం యోగా చేయాలని తద్వారా మనిషి ఆరోగ్యంగా ఉండడంతో పాటు ప్రశాంతత లభిస్తుందన్నారు. ఎంతటి ఒత్తిడికి గురైనప్పటికీ యోగా నేర్చుకున్న వారు ప్రశాంతంగా మంచి నిర్ణయాలు కూడా తీసుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో మండలంలోని అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

# తల్లికి చెప్పలేని ఆనందం..

● ఇంట్లో ఉన్న విద్యార్థులందరికీ తల్లికి వందనం డబ్బు జమ
● వైసీపీ ప్రభుత్వంలో ఇంట్లో ఒకరికే అమ్మఒడి..
● పేద కుటుంబాల్లో సంతోషం..


రూ.39 వేలు లబ్ధి పొందిన వాల్మీకిపురం దండువారిపల్లెకు చెందిన గంగులప్ప, శ్రీలేఖ దంపతుల ముగ్గురు పిల్లలు





(రాయచోటి-ఆంధ్రజ్యోతి): జిల్లాలో చదువుకుంటున్న విద్యార్థుల తల్లులు చెప్పలేని ఆనందంలో ఉన్నారు. ఇంట్లో చదువుకుంటున్న పిల్లలందరికీ ఒక్కొక్కరికి రూ.13 వేలు చొప్పున కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పేరుతో శుక్రవారం నగదును తల్లుల బ్యాంకు అకౌంట్లలో జమ చేసింది. గత వైసీపీ ప్రభుత్వం అమ్మఒడి పేరుతో ఇంట్లో ఒక విద్యార్థికి మాత్రమే రూ.13 వేలు వేసేది. దానికి సైతం ఎన్నో ఆంక్షలు పెట్టేది. అయితే కూటమి ప్రభుత్వం ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు.. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ స్కూళ్లలో చదువుతున్న విద్యార్థులందరికీ ఒక్కొక్కరికి రూ.13 వేలు చొప్పున ఇచ్చింది. దీనిపైన తల్లులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో ఇంట్లో ఐదు మంది... నలుగురు... ముగ్గురు... ఇద్దరు ఉన్నా అందరికీ ఈ పథకం వర్తింపచేయడం విశేషం. కూటమి ప్రభుత్వం చెప్పిన మాట నిలబెట్టుకుంది.

● పుల్లంపేట మండలం దళవాయిపల్లె కేతరాజుపల్లెలో పాలగిరి ఖాదరమ్మ అంగన్‌వాడీ ఆయాగా పనిచేస్తోంది. ఈమె భర్త సుబ్బరాయుడు కూలి పనులకు వెళుతుంటాడు. ఈమెకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు. పెద్ద కుమార్తెకు పెళ్లి చేసింది. రెండవ కుమార్తె మనీషా 8వ తరగతి, మూడవ కుమార్తె షర్మిల 7వ తరగతి పుల్లంపేటలోని బీవీ శేషయ్య సంస్కృత ఉన్నత పాఠశాల (ఎయిడెడ్) స్కూల్‌లో చదువుతున్నారు. కుమారుడు అబ్దుల్లా రెహమాన్ కేతరాజుపల్లె ప్రాథమిక పాఠశాలలో 4వ తరగతి చదువుతున్నాడు. ముగ్గురికీ తల్లికి వందనం డబ్బు వచ్చింది.

● ములకలచెరువు మండలం వేపూరికోటకు ఎద్దులవారిపల్లెకు చెందిన తమకం రామ్మోహన్, లక్ష్మిదేవిలకు ముగ్గురు కుమార్తెలు. రామమోహన్ భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నారు. యోగేశ్వరి ఇంటర్ సెకండియర్, నందిని 10, వైష్ణవి 7వ తరగతి.. ముగ్గురికీ తల్లికి వందనం మంజూరైంది. వైసీపీ ప్రభుత్వంలో కేవలం తన మూడవ కుమార్తె వైష్ణవికి మాత్రం అమ్మఒడి వచ్చింది, ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో ముగ్గురికీ తల్లికి వందనం మంజూరు అయింది.

● పీలేరు మండలం దొడ్డిపల్లె పంచాయతీ నాయనివారిపల్లెకు చెందిన గోళ్ల పార్వతికి ముగ్గురు పిల్లలు. గోళ్ల దీపక్‌నాయకుడు, 10, గోళ్ల ప్రదీప్‌నాయుడు 9, లాస్యప్రియ 6వ తరగతి చదువుతున్నారు. ముగ్గురికీ తల్లికి వందనం మంజూరు అయింది.

● వాల్మీకీపురం మండలంలోని దండువారిపల్లెకు చెందిన పి.గంగులప్ప, శ్రీలేఖ దంపతులకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. కుమారుడు సేతు 8వ తరగతి, గాయత్రి 6వ తరగతి.. ధాత్రి 4వ తరగతి చదువుతున్నారు. ఈ ముగ్గురికి తల్లికి వందనం కింద డబ్బు జమ అయింది.

● చిన్నమండెం మండలం వండాడి గ్రామం కదిరివాండ్లపల్లెలో ఆదోని శాంతకుమారికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఫణీంద్ర 8వ తరగతి, నీరజ 7వ తరగతి, భవ్య 5వ తరగతి చదువుతున్నారు. వీరి ముగ్గురికి రూ.39 వేలు జమ అయింది. ఈ డబ్బు పిల్లలను చదివించుకునేందుకు ఎంతో ఉపయోగపడుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

● పెద్దతిప్పసముద్రం మండలం మల్లెల పంచాయతీ చిన్నమేకలవారిపల్లెకు చెందిన గిరిగి వనజ అనే మహిళ ముగ్గురు పిల్లలు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు. ఆమె భర్త చనిపోయారు. కూటమి ప్రభుత్వం ముగ్గురికీ తల్లికివందనం కింద రూ.39 వేలు జమ చేసింది.


తల్లికి వందనం లబ్ధి పొందిన పెద్దతిప్పసముద్రం మండలం మల్లెల పంచాయతీ చిన్నమేకలవారిపల్లెకు చెందిన గిరిగి వనజ ముగ్గురు పిల్లలు

## ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

● జిల్లా విద్యా శాఖాధికారి సుబ్రహ్మణ్యం


విలేకరులతో మాట్లాడుతున్న డీఈవో సుబ్రహ్మణ్యం

రాయచోటిటౌన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): వివిధ కారణాల వల్ల చదువు మానేసిన వారు పదో తరగతి, ఇంటర్ పూర్తి చేసేందుకు ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యా పీఠం (ఏపీ ఓపెన్ స్కూల్) ద్వారా ప్రభుత్వం సువర్ణావకాశం కల్పించిందని డీఈవో డాక్టర్ కె.సుబ్రహ్మణ్యం తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక డీఈవో కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఓపెన్ స్కూల్ పరీక్షల ద్వారా విద్యార్థులు పొందే ఈ సర్టిఫికెట్లకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రెగ్యులర్ విద్యార్థులతో సమానమైన గుర్తింపు ఉందన్నారు. ఓపెన్ స్కూల్ ద్వారా పదవ తరగతిలో చేరేందుకు ఈ ఏడాది ఆగస్టు 31వ తేదీ నాటికి 14 సంవత్సరాల వయస్సు నిండి ఉండాలని, చదవడం, రాయడం తెలిసి ఉండాలని, ఏదో ఒక తరగతి టీసీ, పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డును కలిగి ఉండాలన్నారు. అదేవిధంగా ఇంటర్ ప్రవేశానికి 10వ తరగతి మార్కుల జాబితా, 10వ తరగతి టీసీని దరఖాస్తుతో పాటు అందజేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు కుల ధ్రువీకరణ పత్రం, దివ్యాంగులు, వికలత్వం అర్హత ధ్రువీకరణ పత్రాన్ని అందజేయాలని సూచించారు. ఎలాంటి అపరాధ రుసుం లేకుండా జూలై 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని, 200 రూపాయల అపరాధ రుసుంతో ఆగస్టు 1 నుంచి ఆగస్టు 15వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు. ఇతర వివరాలకు పనివేళల్లో జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సంప్రదించవచ్చునన్నారు. ఆసక్తి గలవారు మీసేవ, ఏపీ ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

## నేడు మాస్ యోగా నిర్వహించాలి

● జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

రాయచోటి (కలెక్టరేట్), జూన్ 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఈనెల 14వ తేదీ ప్రతి సచివాలయం పరిధిలో ఇప్పటికే గుర్తించిన ప్రదేశాల్లో యోగా కార్యక్రమాన్ని తప్పనిసరిగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో నిర్వహిస్తున్న యోగాంధ్ర మాసోత్సవాల్లో భాగంగా 14న జిల్లా వ్యాప్తంగా నిర్వహించాల్సిన మాస్ యోగా కార్యక్రమ నిర్వహణపై కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదేశాల మేరకు సబ్‌కలెక్టర్లు, ఆర్డీవో, తహసీల్దార్‌లు, ఎంపీడీవోలు, మండల ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, డీఎల్డీవోలు, ఎంఈవోలు, యోగా మాస్టర్ ట్రైనర్లు, పంచాయతీ సెక్రటరీలు తదితరులతో జేసీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఈనెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం నాడు జిల్లాలో 7.50 లక్షల మందితో యోగా నిర్వహించడమే లక్ష్యమన్నారు. ఇందుకు గ్రామ, వార్డు ప్రతి సచివాలయం పరిధిలో కనీసం 9 ప్రదేశాలను ఇప్పటికే గుర్తించామని, వాటిని వెంటనే జియోట్యాగింగ్ చేయాలన్నారు. ఆయా ప్రదేశాల్లో, ప్రతి పాఠశాల, వసతి గృహాలు, కళాశాలలో 14న రెండవ శనివారం ఉదయం 6 నుంచి 8 గంటల వరకు మాస్ యోగా కార్యక్రమాన్ని నిర్వహించి విజయవంతం చేయాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో సబ్ కలెక్టర్లు మేఘస్వరూప్, నైదియాదేవి, డీఆర్వో మధుసూదన్‌రావు, ఆర్డీవో శ్రీనివాస్, డీఆర్డీఏ, డ్వామా పీడీలు సత్యనారాయణ, వెంకటరత్నం, అడిషనల్ డీఎంహెచ్‌వో శైలజ, బీసీ వెల్ఫేర్ అధికారి సురేశ్, సమాచార శాఖ డీపీఆర్వో పురుషోత్తం, మండల ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంఈవోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## డీజీపీని కలిసిన ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటిటౌన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర డీజీపీగా హరీశ్‌కుమార్‌గుప్తాను శుక్రవారం ఎస్పీ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. డీజీపీగా పూర్తి స్థాయి బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా శుక్రవారం ఎస్పీ డీజీపీని ఆయన ప్రధాన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

డీజీపీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు



## పకడ్బందీగా డీఎస్సీ పరీక్షలు

రాయచోటిటౌన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలోని మదనపల్లి, రాజంపేట, రాయచోటి ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఆరు పరీక్షా కేంద్రాల్లో డీఎస్సీ పరీక్షలు అత్యంత పకడ్బందీగా, ప్రశాంత వాతావరణంలో జరుగుతున్నాయి. కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రమణ్యం, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి రవిల ఆధ్వర్యంలో విద్యాశాఖాధికారుల పరీక్షలను పర్యవేక్షిస్తున్నారు. శుక్రవారం 6 పరీక్షా కేంద్రాల్లో 1131 మంది అభ్యర్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 1062 మంది హాజరు కాగా 69 మంది గైర్హాజరైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారులు తెలిపారు.

## 15లోగా ఆధార్‌కు బ్యాంక్ ఖాతా లింక్ చేసుకోవాలి

● జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సాధికారిత అధికారి రాధిక

రాయచోటిటౌన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం పథకం కోసం ఇంటర్మీడియట్ చదివే ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు ఈనెల 15వ తేదీలోగా ఆధార్-బ్యాంక్ ఖాతా లింక్ చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సాధికారత అధికారి బి.రాధిక శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేయబోతున్న తల్లికి వందనం పథకం కింద ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఆర్థికసాయం అందించడానికి వారి ఆధార్ నెంబర్లు వారి బ్యాంక్ ఖాతాలతో తప్పనిసరిగా అనుసంధానించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికీ ఇంకా సుమారు 1660 మంది ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థుల ఆధార్-బ్యాంక్ ఖాతా లింక్ పూర్తి కాలేదన్నారు. ఈ విషయమై సాంఘీక సంక్షేమశాఖ సంచాలకుల కార్యాలయం నుంచి జిల్లా, మండలాల వారీగా విద్యార్థుల జాబితాతో కూడిన నివేదిక అందిందన్నారు. అందులో ఉన్న సంబంధిత విద్యార్థుల పేర్లు, సంప్రదించాల్సిన నెంబర్లు ఇప్పటికే సంబంధిత సచివాలయాల సిబ్బందికి పంపించామన్నారు. తక్షణమే ఆ విద్యార్థులు ఆధార్- బ్యాంక్ ఖాతా అనుసంధానం చేసే ప్రక్రియను పూర్తి చేయాలన్నారు.

6
ఉద్యాన పంటల పరిశోధనలు ఏవీ?
● ఎనిమిదేళ్లుగా ఎక్కడి గొంగళి అక్కడే...
● బోర్డుకే పరిమితమైన ఉద్యాన పరిశోధనల కేంద్రం

6
వానరానికి అంత్యక్రియలు
● విద్యుదాఘాతంతో వానరం మృతి
● సంప్రదాయబద్ధంగా ఖననం
● అంత్యక్రియల్లో హిందూ, ముస్లింలు

కుమారుడిపై అక్రమ కేసు పెట్టారంటూ... 6
పోలీస్‌స్టేషన్ ఎదుట తండ్రి ఆత్మహత్యాయత్నం

## కఠిన చర్యలతోనే నేరాల నియంత్రణ

● నేర సమీక్షలో అదనపు ఎస్పీ వెంకటాద్రి


సమావేశానికి హాజరైన మదనపల్లి సబ్ డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులు, సమీక్షలో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ వెంకటాద్రి (ఇన్‌సెట్‌లో)

రాయచోటిటౌన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణకు కఠిన చర్యలు తీసుకోవాలని, కొత్త న్యాయ చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అదనపు ఎస్పీ ఎం.వెంకటాద్రి తెలిపారు. శుక్రవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో మదనపల్లి సబ్ డివిజన్ పరిధిలోని పోలీసు అధికారుల నెలవారీ నేర సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్లలో నమోదయ్యే కేసుల వివరాలను ప్రతీ అంశాన్ని క్షుణ్ణంగా సీసీటీఎన్ఎస్‌లో ఎప్పటికప్పుడు పొందుపరచాలని తెలిపారు. గంజాయి వినియోగించే వారి వివరాలను బట్టి వారికి కౌన్సిలింగ్ ఇవ్వడమే కాకుండా వారిపై కఠినమైన చర్యలు చేపట్టాలన్నారు. మహిళా సంబంధిత నేరాలపై ప్రత్యేక శ్రద్ధతో దర్యాప్తు జరపాలని, దొంగతనాలు జరగకుండా చూడాలని, నేరాల నియంత్రణకు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అందరు అధికారులు సీడీ ఫైల్స్ సీసీటీఎన్ఎస్‌లో అప్లోడ్ అవుతున్నాయా లేదా అనేది తప్పనిసరిగా చూసుకోవాలని, అలా అయితేనే మనం కచ్చితమైన సమాచారాన్ని పొందగలమని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తించాలని స్పష్టం చేశారు. సమావేశానికి హాజరైన పోలీసు అధికారులు సంబంధిత పోలీస్‌స్టేషన్ల పరిధిలో నేరాల స్థితిగతులు, పట్టుబడిన నిందితుల వివరాలు, విచారణ పురోగతి తదితరాలను వివరించారు. సమిష్టి కృషి, సమన్వయంతో పని చేసే జిల్లాలో నేర నియంత్రణకు శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాలని అదనపు ఎస్పీ పోలీసు అధికారులను ఆదేశించారు. సమావేశంలో మదనపల్లి డీఎస్పీ ఎస్.మహేంద్ర, స్థానిక పోలీసు అధికారులు, మదనపల్లి సబ్ డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

## నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

● రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు


సమావేశంలో మాట్లాడుతున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు

ఒంటిమిట్ట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట నియోజకవర్గాన్ని అభివృద్ధి దిశగా నడిపించడమే తన లక్ష్యమని రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు తెలిపారు. శుక్రవారం మండలంలోని ఒంటిమిట్ట, గంగపేరూరు, పెన్నపేరూరు, గొల్లపల్లె గ్రామాల్లో సిమెంటు రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాలను సంతృప్తిపరిచేలా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాలన సాగిస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌ల సారథ్యంలో ఒంటిమిట్ట మండలంలో అభివృద్ధి పరుగులు పెట్టిస్తామని తెలిపారు. కార్యకర్తలకు తాను ఎళ్లప్పుడూ అండగా ఉంటానని, మండలంలో సుమారు 5 కోట్ల రూపాయలతో రహదారుల నిర్మాణ పనులను చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గజ్జల నరసింహారెడ్డి, ఎంపీడీవో గౌస్‌బాషా, పార్టీ సీనియర్ నాయకులు ఎస్వీ రమణ, మండల ప్రధాన కార్యదర్శి బొబ్బిలి రాయుడు, పీఆర్ డీఈ శ్రీనివాసులు, పీఆర్ ఏఈ ప్రసాద్, పార్టీ సీనియర్ నాయకులు ఎంవీ రమణ, న్యాయవాది రామదాసు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థిని అదృశ్యంపై కేసు నమోదు

గుర్రంకొండ, జూన్ 13(ఆంధ్రజ్యోతి): విద్యార్థిని వైష్ణవి అదృశ్యంపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ గజేంద్ర తెలిపారు. టి.రాచపల్లెకు చెందిన దేవేంద్ర కుమార్తె అంగళ్ల సమీపంలోని ఓ ప్రైవేట్ కాలేజిలో ఇంటర్ పూర్తి చేసింది. గత నెల 20వ తేదీన ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్ష రాయడానికి అంగళ్లకు వెళ్లి తిరిగి స్వగ్రామానికి చేరుకుంది. అదే రోజు సాయంత్రం విద్యార్థిని ఇంటి నుంచి కనబడకుండా పోయింది. దీంతో కుటుంబ సభ్యులు బంధువులు, తెలిసిన వారిని విచారించిన ఆచూకీ తెలియకపోడంతో శుక్రవారం పోలీసులను ఆశ్రయించారు. పోలీసుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

## ట్రాక్టర్‌ను బావిలో పడేసిన దుండగులు



బావి నుంచి ట్రాక్టర్‌ను వెలికి తీస్తున్న దృశ్యం

పెద్దమండ్యం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): నిరుపేద యువకుడు ట్రాక్టర్ తోలుకుంటూ జీవిస్తుంటే ఆ ట్రాక్టర్‌ను బావిలో పడేసిన సంఘటన పెద్దమండ్యం మండలంలో గురువారం జరిగింది. బాధితుడు, గ్రామస్థుల కథనం మేరకు మండలంలోని బండమీదపల్లి వాసి నాగార్జున నిరుపేద కుటుంబం. కష్టపడి వ్యవసాయ కూలీ పనులు, డ్రైవర్ వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. 15 ఏళ్లు కష్టపడి కూడబెట్టుకున్న డబ్బుతో మూడేళ్ల కిందట రూ.7 లక్షలతో ఒక ట్రాక్టర్ తెచ్చుకుని బాడుగకు తోలుకుంటూ కుటుంబం జీవనం సాఫీగా సాగిస్తున్నాడు. గురువారం కూడా యధావిధిగా ట్రాక్టర్‌ను ఇంటి సమీపంలో పెట్టాడు. అర్ధరాత్రి మూత్ర విసర్జనకు లేచి చూస్తే ట్రాక్టర్ కనబడకపోవడంతో ఆందోళన చెందిన బాధితుడు సహచరులతో చుట్టు పక్కల ట్రాక్టర్ చక్రాలు జాడలు గమినించారు. గ్రామం సమీప వ్యవసాయ బావిలో పడి వున్నట్లు గుర్తించారు. శుక్రవారం పెద్దమండ్యం పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు విచారించి ఇలాంటి సంఘటన మళ్లీ జరగకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరారు. ఏడాదిగా పెద్దమండ్యం పోలీసు స్టేషన్‌లో సిబ్బంది కొరతతో గ్రామాల్లో రాత్రిళ్లు కాక పగలు కూడా గస్తీలు జరగలేదని ప్రజలు వాపోతున్నారు.

## రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి



ఓబులవారిపల్లె, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో మండలంలోని చిన్నఓరంపాడు పంచాయతీకి చెందిన పిడికిటి సుబ్రమణ్యం (73) అక్కడికక్కడే దుర్మరణం చెందారు. పోలీసుల వివరాల మేరకు... సుబ్రమణ్యం ద్విచక్రవాహనంపై కడప-చెన్నై జాతీయ రహదారి రెడ్డిపల్లె చెరువుకట్ట సమీపంలో ఉన్న పొలం వద్దకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చే క్రమంలో తిరుపతివైపు వెళుతున్న స్విఫ్ట్ వీడీఐ వాహనం ఢీకొంది. దీంతో సుబ్రమణ్యం అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రైల్వేకోడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ మహేష్ తెలిపారు. మృతుడికి భార్య జయమ్మ, కుమారులు శివకుమార్, మహేష్, ఇద్దరు కుమార్తెలు మణెమ్మ, సరస్వతి ఉన్నారు. మృతుడి చిన్నకుమారుడు మహేష్ గత శనివారం నాడే బతుకుదెరువు కోసం గల్ఫ్ దేశం వెళ్లాడు. వీరందరికి పెళ్లిళ్లు అయి పిల్లలు ఉన్నారు.

### జేఎన్టీయూ మొదటి ఏడాది

## ఇంజనీరింగ్ ఫలితాల వెల్లడి



ఫలితాలు ప్రకటిస్తున్న ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు

కలికిరి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలల్లో బీటెక్ మొదటి సంవత్సరం ఫలితాలను శుక్రవారం ప్రిన్సిపాల్ వెంకటేశ్వర రావు ప్రకటించారు. మొదటి ఏడాది (2024-25) రెండో సెమిస్టర్ ఫలితాలు, 2023-24 కంపార్ట్‌మెంటల్ పరీక్షా ఫలితాలను కూడా వెల్లడించారు. కలికిరి జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలకు అటానమస్ స్థాయి దక్కిన తరువాత తొమ్మిదవ విడత ఫలితాలను వెల్లడించారని చెప్పారు. మొత్తం ఫలితాల్లో 66.23 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులు కాగా ఇందులో ఈసీఈలో 95.16 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారన్నారు. పరీక్షలు నిర్వహించిన రెండు వారాల్లోగా ఫలితాలు ప్రకటించడం ద్వారా రెండో సంవత్సరం మొదటి సెమిస్టర్ చదివే విద్యార్థులు ఈ ఫలితాలకు అనుగుణంగా విద్యా ప్రణాళికలను రూపొందించుకునే అవకాశం కలుగుతుందని ప్రిన్సిపాల్ చెప్పారు. ఫలితాలను కళాశాల నోటీసు బోర్డులోనూ, కాలేజీ వెబ్‌సైట్‌లోనూ పొందుపరుస్తామన్నారు. ఉత్తీర్ణులైన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో కళాశాలకు చెందిన వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## సోలార్ రూఫ్‌టాప్‌ను ఏర్పాటు చేసుకోండి

రైల్వేకోడూరు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): సోలార్‌ను వినియోగించుకుంటే విద్యుత్ భారం ఉండదని రాజంపేట విద్యుత్ శాఖ ఈఈ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం రైల్వేకోడూరు విద్యుత్ శాఖ కార్యాలయ ఆవరణంలో ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకంపై వినియోగదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోలార్ రూఫ్ ఏర్పాటుపై బ్యాంకులు రుణాలు ఇచ్చేందుకు ముందుకు వచ్చాయన్నారు. (సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు సామర్థ్యం లోడ్) 3 కిలోవాట్‌కు ఉత్పత్తి అయ్యే 360 యూనిట్లకు ప్రాజెక్టు ధర రూ.2,30,000, ఇందులో కేంద్ర ప్రభుత్వం రూ.78,000 ఇస్తుందన్నారు. 4 కిలోవాట్లకు 480 యూనిట్లు ప్రాజెక్టు ధర 3,00000, 5 కిలోవాట్లకు 600 యూనిట్లకు 3,50,000 ప్రాజెక్టు ధర ఉంటుందన్నారు. వీటన్నింటికి రూ.78,000 కేంద్ర ప్రభుత్వ సబ్సిడీ వస్తుందన్నారు. సోలార్ రూఫ్‌పై ఎక్కడా అపోహలు లేకుండా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. సోలార్ రూఫ్ ఏర్పాటు చేసుకుంటే 90 శాతం కరెంటు బిల్లు ఆదా చేసుకోవచ్చన్నారు. సోలార్‌ను ఉపయోగించడం వల్ల బొగ్గు ఆధారిత విద్యుత్ తగ్గుతుందన్నారు. దీంతో సహజ వనరులను భావితరాలకు పొదుపు చేసిన వాళ్లవుతారన్నారు. సోలార్ అన్‌గ్రిడ్ నెట్‌మీటర్ ద్వారా వ్యాపార రీత్యా ఇన్‌స్టాల్ చేసుకున్న వారికి రాయితీ ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో రైల్వేకోడూరు ఏడీఈ భాస్కర్‌రావు, వెలుగు సీసీ నారాయణ, బ్యాంకర్లు, విద్యుత్ వినియోగదారులు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యాన పంటల పరిశోధనలు ఏవీ?

- ఎనిమిదేళ్లుగా ఎక్కడి గొంగళి అక్కడే... వృథాగా 79 ఎకరాలు
- బోర్డుకే పరిమితమైన ఉద్యాన పరిశోధనల కేంద్రం
- అమలుకు నోచుకోని డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ ఆదేశాలు
- ఉద్యానవన శాఖ లక్ష్యం పూర్తయ్యేది ఎప్పుడో?



రీసెర్చ్ సెంటర్ భూముల సముదాయ ముఖద్వారం



భూములను పరిశీలిస్తున్న డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ మాధవి (ఫైల్)

బి.కొత్తకోట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కూరగాయలు, పూలసాగుపై శాస్త్రవేత్తలచే పరిశోధనలు చేసి నూతన వంగడాలను రూపొందించి ఉద్యానపంటల సాగులో అధిక ఉత్పత్తులు సాధించి, రైతులను ఆదుకోవాలన్న ఆశయంతో బి.కొత్తకోట మండలంలో ఏర్పాటు చేసిన ఉద్యాన పరిశోధన కేంద్రం దయనీయ స్థితిలో ఉంది. తాడేపల్లిగూడెంలోని డాక్టర్ వైఎస్సార్ హార్టికల్చర్ యూనివర్సిటీ పరిధిలో రాష్ట్రంలో 20 పరిశోధనా కేంద్రాలుండగా, అందులో రాయలసీమలోని అనంతపురం, మహానంది, అనంతరాజుపేట, పులివెందుల, బి.కొత్తకోట మండల పరిధిలోని బయప్పగారిపల్లె కేంద్రంగా నెలకొల్పిన ఉద్యాన పరిశోధనా కేంద్రం ఒకటి. ఉద్యాన పంటల సాగుపై విప్లవాత్మక మార్పులకు ఈ కేంద్రం మూలం కావాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కారణాలు ఏవైనా ప్రభుత్వ లక్ష్యం నెరవేరలేదు. ఏళ్ల తరబడి బోర్డులకే పరిమితమైంది.

> **త్వరలో పరిశోధనా కేంద్రం అభివృద్ధి**
>
> యూనివర్సిటీ నిధులతో కొంత భూమిని చదును చేశాం. ఫెన్సింగ్ వేశాం. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కోసం డీడీ కట్టాము. అది మంజూరైతే బోర్లు వేయించాలి. రాష్ట్రీయ కృషి వికాస్ యోజన (ఆర్కేవీవై) ద్వారా రూ.1.30 కోట్ల నిధులకు అప్రూవల్ అయింది. నిధులు విడుదలైతే పూర్తి స్థాయి ఉద్యాన పంటల పరిశోధనలు జరుగుతాయి.
>
> - ప్రతాప్ ఉద్యాన శాస్త్రవేత్త, బయ్యప్పగారిపల్లి కేంద్రం

### రూ.కోట్ల భూములను సమకూర్చిన టీడీపీ ప్రభుత్వం

2017లో అప్పటి టీడీపీ ప్రభుత్వంలో మండలంలోని బయప్పగారిపల్లి పంచాయతీ పరిధిలో ప్రధాన రహదారికి ఇరువైపులా రూ.కోట్ల విలువైన 79 ఎకరాల వ్యవసాయ భూమిని సేకరించింది.. ఇందులో అధునాతన భవన నిర్మాణం చేసి హార్టికల్చర్ యూనివర్సిటీ పర్యవేక్షణలో వ్యవసాయ శాస్త్రవేత్తలతో పూలు, కూరగాయల పంటలపై పరిశోధనలు జరపాలని భావించారు. ఆ పరిశోధనలను రైతులకు వివరించి, సాగుపై అవగాహన కల్పించి ఉద్యాన పంటల సాగులో నూతన సాంకేతికతతో కొత్త ఒరవడిని సృష్టించాల్సి ఉండగా అందుకు విరుద్ధంగా ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఈ పరిశోధనా కేంద్రం 8 ఏళ్లుగా నిద్రావస్థలోనే ఉంది. భూకేటాయింపు అనంతరం నిధుల కోసం ప్రతిపాదనల స్థాయిలో ఉండగానే ప్రభుత్వం మారడంతో పరిశోధనా క్షేత్ర పనులు ముందుకు సాగలేదు.



హార్టికల్చర్ రీసెర్చ్ సెంటర్ కోసం కేటాయించిన 79 ఎకరాల భూమి

### డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ ప్రకటించినా కూడా..

డాక్టర్ వైఎస్సార్ హార్టికల్చర్ యూనివర్సిటీ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ ఎం.మాధవి ఈ ఏడాది ఫిబ్రవరి 6న బి.కొత్తకోట మండలంలోని ఈ పరిశోధనా కేంద్రానికి వచ్చారు. కేంద్ర అభివృద్ధి, కార్యకలాపాల కోసం ప్రభుత్వాలు నిధులు కేటాయించకపోవడం వల్ల పరిశోధన కార్యక్రమాలు జరగలేదని తెలిపారు. యూనివర్సిటీ నిధులు రూ.25 లక్షలతో ప్రస్తుతానికి 5 ఎకరాలలో పరిశోధనాత్మక సాగును ప్రారంభిస్తామని, నేలను చదును చేసి, కొత్త బోర్లు వేయించి పూలు, కూరగాయల సాగులో పరిశోధనల కోసం ఇద్దరు వ్యవసాయ శాస్త్రవేత్తలను నియమిస్తామన్నారు. నెల రోజుల్లో 5 ఎకరాలలో ప్రారంభిస్తామని చెప్పి నాలుగు నెలలైనా ఇంతవరకు ఎటువంటి పనులు ప్రారంభం కాలేదు.

> **కార్యాలయ భవనమూ కరువే...**
>
> ఉద్యాన పరిశోధనా కేంద్రానికి 79 ఎకరాల భూములున్నా సొంత కార్యాలయ భవనం కూడా లేని దుస్థితి నెలకొంది. పక్కనే ఉన్న సిరికల్చర్ ఫాంలో ఓ గదిని కేటాయించడంతో నామమాత్రంగా అదే కార్యాలయంగా కానిచ్చేస్తున్నారు. ప్రస్తుతం మామిడి చెట్లు ఉన్న ప్రాంతంలో 5 ఎకరాల ప్లాటు కోసం ఫెన్సింగ్ మాత్రం వేశారు. నూతన భవన నిర్మాణం ఊసేలేదు. డాక్టర్ వైఎస్సార్ హార్టికల్చర్ యూనివర్సిటీ ఉద్యానపరిశోధనా స్థానం అని బోర్డులు ఏర్పాటు చేయడం తప్ప ఎనిమిదేళ్లుగా చేసిందేమీ లేదు. ఇప్పటికైనా చేస్తారా అని రైతులు ఎదురు చూస్తున్నారు.
>
> 
>
> సిరికల్చర్ ఫాంహౌస్‌లో తాత్కాలికంగా ఉన్న రీసెర్చ్ కార్యాలయం

# సోలార్ రూఫ్‌టాప్‌తో విద్యుత్ ఆదా



గుర్రకొండలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న డీఈ చంద్రశేఖర్‌రెడ్డి

గుర్రంకొండ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రజలు, రైతులు సోలార్ రూఫ్‌టాప్‌ను ఏర్పాటు చేసుకోవడం ద్వారా విద్యుత్ ఆదాతో పాటు కరెంట్ బిల్లులను తక్కువ మొత్తంలో చెల్లించడానికి మంచి పథకమని ఈఈ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రమైన గుర్రంకొండ సబ్‌స్టేషన్‌లో రైతులు, ప్రజలతో శుక్రవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఈ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ సోలార్ రూఫ్‌టాప్ పథకంలో 1 కిలో వాట్ నుంచి 3 కిలో వాట్స్ వరకు సబ్సిడీతో ఏర్పాటు చేసుకోవచ్చునన్నారు. దీంతో ప్రజలకు కరెంట్ బిల్లుల భారం బాగా తగ్గుతుందన్నారు. సూర్యఘర్ పథకంలో విద్యుత్ ఆదాతో పాటు ఇళ్లకు కరెంట్ సమస్య ఉండదన్నారు. గ్రామాల్లో ప్రజలు పథకాన్ని సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఏడీ శివయ్య, సబ్ ఇంజనీర్ మోసీన్, సిబ్బంది పాల్గొన్నారు.


### సోలార్‌తో విద్యుత్ ఆదా..

వాల్మీకిపురం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సబ్సిడీతో ఇస్తున్న సోలార్ రూఫ్ టాప్ నిర్మించుకోవడం ద్వారా విద్యుత్ ఆదా చేసుకోవచ్చని ట్రాన్స్‌కో ఈఈ ంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సమీపంలోని పునుగుపల్లె విద్యుత్ సబ్‌స్టేషన్ నందు ప్రధానమంత్రి సూర్యాఘర్ యోజన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటులో 1కిలోవ్యాట్‌కు 120యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి, ప్రభుత్వ సబ్సిడీ రూ.30వేలు, 2కిలో వ్యాట్‌లకు 240యూనిట్లు ఉత్పత్తి రూ.60వేలు సబ్సిడీ, 3కిలో వ్యాట్‌లకు 360 యూనిట్లు ఉత్పత్తి రూ.78వేలు సబ్సిడీలతో ఈ పథకాన్ని గృహ వినియోగ దారులకు మాత్రమే మంజూరు చేయడం జరుగుతుందన్నారు. సోలార్ ఏర్పాటు ద్వారా విద్యుత్ బిల్లును కూడా ఎంతో ఆదా చేస్తుందని గృహ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కోసూరి చంద్రమౌళి, టీడీపీ రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టర్ వల్లిగట్ల వెంకటరమణ, జిల్లా పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు వెంకటరమణ, టీడీపీ మండలపార్టీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, ఏఈ రాజశేఖర్, సబ్ ఇంజనీర్ జాకీర్‌హుస్సేన్, నాయకులు వీవీ నారాయణ, రాజేంద్రాచారి, కోసూరి రమేశ్, శేషాద్రిరెడ్డి, బొక్కసం బ్రదర్స్ ట్రాన్స్‌కో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# వానరానికి అంత్యక్రియలు

- విద్యుదాఘాతంతో వానరం మృతి
- సంప్రదాయబద్ధంగా ఖననం
- అంత్యక్రియల్లో పాల్గొన్న హిందూ, ముస్లింలు





పాపిరెడ్డిగారిపల్లెలో చనిపోయిన వానరం, వానరానికి అంత్యక్రియలకు సిద్ధం చేసిన గ్రామస్తులు

కలకడ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన వానరానికి అంత్యక్రియలు చేశారు. కలకడ మండలం పాపిరెడ్డిగారి పల్లెలో వెలుగు చూసిన సంఘటనలోకెళితే... విద్యుదాఘాతంతో చనిపోయిన వానరానికి గ్రామమంతా ఏకమై ఘనంగా అంత్యక్రియలు నిర్వహించి మానవత్వం చాటుకున్నారు. శుక్రవారం పాపిరెడ్డిగారిపల్లె మసీదు వద్ద వానరాలు వెళుతుండగా ప్రమాదవశాత్తు ఓ వానరం విద్యుత్ తీగలకు తగలడంతో మృతి చెంది కిందపడిపోయింది.

ఇది గమనించిన స్థానికులు మనిషికి అంత్యక్రియలు చేసే విధంగానే వానరానికి అంత్యక్రియలు నిర్వహించారు. తొలుత హిందువులు అంతిమయాత్రకు ముందుకు రాగా అక్కడే ఉన్న ముస్లింలు, మహిళలు ముందుకు వచ్చి ఘనంగా ఏర్పాట్లు చేశారు.

వానరం కళేబరానికి వరిగడ్డి, కొత్త తెల్లబట్టతో పాడె కట్టి స్నానం చేయించి సుగంధ ద్రవ్యాలు చల్లడం, పూలమాలలు వేసి అగరబత్తీలు వెలిగించి, టెంకాయలు కొట్టి కర్పూర హారతులిచ్చారు. సాధారణంగా మనిషి తరహాలోనే పాడె మోస్తూ బాణాసంచా పేల్చుతూ మంగళవాయిద్యాలు, డప్పువాయిద్యాల నడుమ గ్రామస్థులు కోతికి అంతిమయాత్రను నిర్వహిస్తూ స్థానిక గొల్లపల్లె రోడ్డులో ఖననం చేశారు. కార్యక్రమంలో బోడోళ్ల రాజారెడ్డి, రహంతుల్లా, 104 రమేశ్, సమిడిశెట్టి అమరనాథ్, చంద్ర, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమంగా నాటిన మొక్కలు తొలగింపు





ప్రభుత్వ భూమిలో అక్రమంగా నాటిన మొక్కలను తొలగిస్తున్న దృశ్యం, చిట్టిబోయినపల్లెలో రోడ్డు పక్కనున్న విలువైన ప్రభుత్వ భూమిలో నాటిన మొక్కలు

- **ప్రభుత్వ భూమిలో బోర్డు ఏర్పాటు**

గుర్రంకొండ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమిలో అక్రమంగా నాటిన మామిడి, నేరేడు, టెంకాయ మొక్కలను రెవెన్యూ సిబ్బంది శుక్రవారం తొలగించారు. చిట్టిబోయినపల్లె రెవెన్యూ గ్రామంలోని సర్వే నెంబరు 87/8లో 2.30 ఎకరాల ప్రభుత్వ భూమి ని రెండు నెలల కిందట వైసీపీ నేతలు అక్రమించుకుని అమ్మడానికి సిద్ధం చేశారు. ఈ క్రమంలో ప్రభుత్వ భూమి ఆక్రమణపై పత్రికలో కథనాలు ప్రచురితమవడంతో రెవెన్యూ అధికారులు అడ్డుకుని హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. దీంతో నెల రోజులకు పైగా అక్రమార్కులు మిన్నకుండిపోయారు. ఈ నేపథ్యంలో నాలుగు రోజుల కిందట అక్రమార్కులు రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన బోర్డును తొలగించి రాత్రి పూట ప్రభుత్వ భూమిని చదును చేసి అందులో మొక్కలను నాటారు.

ఈ విషయం తహసీల్దార్ దృష్టికి వెళ్లడంతో అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని వీఆర్వోకు సూచించారు. ఈ క్రమంలో వీఆర్వో భరత్‌నాయక్ శుక్రవారం ప్రభుత్వ భూమిలో అక్రమంగా నాటిన మొక్కలను కూలీల సాయంతో తొలగించి హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేయించారు. మరోమారు ప్రభుత్వ భూమిలోకి ప్రవేశిస్తే వారిపై ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని తెలిపారు.

## జూలై 7న రైల్వే ఇన్‌స్టిట్యూట్ ఎన్నికలు

నందలూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : నందలూరు రైల్వే కేంద్రంలోని రైల్వే ఇన్‌స్టిట్యూట్‌కు జూలై 7న ఎన్నికలు జరిపేందుకు గుంతకల్ సీనియర్ డివిజనల్ పర్సనల్ అధికారి ఈనెల 12న నోటిఫికేషన్ విడుదల చేశారని రైల్వే ఇన్‌స్టిట్యూట్ సెక్రటరీ విశ్వనాథ్ తెలిపారు. శుక్రవారం మాట్లాడుతూ ఈ నోటిఫికేషన్‌లో ప్రిన్సిపల్ ఆఫీసు బేరర్స్‌గా సెక్రటరీ, జాయింట్ సెక్రటరీ, ట్రెజరర్ పోస్టులకు పోటీ చేయవచ్చునని కమిటీ మెంబర్స్‌గా ఆరుగురు పోటీ చేయవచ్చునని అన్నారు. ఈ ఎన్నికల్లో ఓటు వేయాలంటే రైల్వే ఉద్యోగి డిసెంబరు 2024 నుంచి మే 2025 వరకు ఆరు నెలలుగా కంటిన్యూగా రైల్వే ఇన్‌స్టిట్యూట్ మెంబర్‌షిప్ శాలరీలో కట్ అయి ఉండాలని, మెంబర్‌షిప్ లిస్టులో ఎవరి పేరు అయినా లేకుంటే ఈనెల 16 లోపు వెల్ఫేర్ ఇన్‌స్పెక్టర్‌కు తెలుపుకోవాలని అన్నారు. ఫైనల్ ఓటర్ల లిస్టు ఈనెల 17న ప్రచురిస్తారని, నామినేషన్ ప్రక్రియ ఈనెల 19వ తేదీ ఉదయం 10 గంటల నుంచి 23వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు స్వీకరిస్తారన్నారు. ఎలిజిబులిటీ మెంబర్స్ లిస్టును ఈనెల 25 తేదీ ప్రకటిస్తారని, నామినేషన్ల విత్‌డ్రా ఈనెల 27వ తేదీ చేసుకోవచ్చన్నారు. ఫైనల్ నామినేషన్స్ లిస్టును ఈనెల 28న ప్రకటిస్తారన్నారు. జూలై 7న ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓటింగ్ ప్రక్రి య జరుగుతుందన్నారు. అదేరోజు సాయంత్రం 5 గంటల నుంచి కౌంటింగ్ ప్రక్రియ జరుగుతుందని, గుంతకల్ డివిజనల్ అధికారులు, రైల్వే ఇన్‌స్టిట్యూట్ కేర్ టేకర్ సెక్రటరీ కె.విశ్వనాథ్ తెలిపారు.

### కుమారుడిపై అక్రమ కేసు పెట్టారంటూ...

## తండ్రి ఆత్మహత్యాయత్నం



ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతున్న వెంకటరమణను అడ్డుకుంటున్న పోలీసులు

రాయచోటి టౌన్ జూన్ 13 (ఆంధ్రజ్యోతి): బాలిక ఆత్మహత్య ఘటన కేసులో తన కుమారుడు తారకరత్నను పోలీసులు అక్రమంగా ఇరికించి జైలుకు పంపారంటూ రాయచోటి పోలీసు స్టేషన్ ఎదుట శుక్రవారం తారకరత్న తండ్రి వెంకటరమణ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. వెంటనే పోలీసులు వెంకటరమణను పోలీసుస్టేషన్ నుంచి హుటాహుటిన స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులు మెరుగైన చికిత్స కోసం రాయచోటిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఈనెల 11వ తేదీ రాయచోటి పట్టణ పరిధిలోని మిట్టవాండ్లపల్లెలో బాలిక ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటనలో ఆ బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు తారకరత్న అనే యువకుడిని అరెస్టు చేశారు. తన కుమారుడిని అనవసరంగా కేసులో ఇరికించారని మనస్థాపానికి గురై వెంకటరమణ పోలీసుస్టేషన్ ఎదుట పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. బాలిక మృతి వెనుక తన కుమారుడి పాత్ర ఏమీలేదని, రాజకీయ ఒత్తిడితోనే తమ కుమారుడిపై పోలీసులు అక్రమంగా కేసుపెట్టి జైలుకు పంపారని తారకరత్న తల్లి పేర్కొన్నారు.

### బాలిక ఆత్మహత్య కేసులో ముగ్గురి అరెస్టు

మిట్టావాండ్లపల్లెలో ఈనెల 11వ తేదీన ఉరి వేసుకొని బాలిక ఆత్మహత్య చేసుకున్న కేసులో శుక్రవారం రాయచోటి అర్బన్ పోలీసులు తారకరత్న, వెంకటస్వామి, మణెమ్మలను అరెస్టు చేసి కోర్టులో హాజరుపెట్టినట్లు అర్బన్ సీఐ వెంకటాచలపతి తెలిపారు.

### విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ కార్యవర్గం

## నియామకానికి దరఖాస్తు చేసుకోండి

రాజంపేట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట రెవెన్యూ సబ్ డివిజన్‌లో విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ కార్యవర్గ నియామకానికి అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సబ్ కలెక్టర్ నిధియాదేవి తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవోఎంఎస్ 99, సాంఘిక సంక్షేమ శాఖ 09.12.2015న పొందుపరిచిన మార్గదర్శకాల మేరకు షెడ్యూల్డ్ కులాలు, తెగల సంఘం నుంచి ఇద్దరు, ప్రభుత్వేతర వర్గాలకు సంబంధించి మరో ఇద్దరు సభ్యుల నియామకం ఉంటుందన్నారు. అర్హులైన సామాజిక స్పృహ కలిగి వివాదరహితులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 17వ తేదీ లోపు రాజంపేట సబ్‌కలెక్టర్ కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలన్నారు.

# బడి రుణం కొంత తీర్చుదామని..!




వారంతా చదువులమ్మ చెట్టు కొమ్మలు. చదువు విలువ ఎరిగి కష్టపడి ఉన్నత శిఖరాలను అధిరోహించారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాలతో పాటు దేశ, విదేశాల్లో స్థిరపడ్డారు. కష్టపడి చదివాం, మన బతుకేదో తాము బతికేద్దాం అనుకోలేదు. తమ ఉన్నతికి పునాదిగా నిలిచిన సరస్వతి నిలయానికి వారు తమ హృదయాల్లో చోటు కల్పించారు. ఈ పాఠశాలలో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించిన సుమారు 15 మంది పూర్వ విద్యార్థులు ఒక సంఘంగా ఏర్పడ్డారు. చదువుకున్న బడి రుణం ఎప్పటికీ తీర్చుకోలేమని తెలిసినా, పదేళ్లుగా పాఠశాలలో ప్రాథమిక వసతుల కల్పనకు తమవంతు సహాయ సహకారాలు అందిస్తున్నారు

- పూర్వ విద్యార్థుల సేవానిరతి
- రూ.10 లక్షల వ్యయంతో మౌలిక వసతులు
- స్ఫూర్తిదాయకంగా పాత విద్యార్థుల సంఘం

ప్రొద్దుటూరు రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): . . ప్రొద్దుటూరు మండలం తాళ్లమాపురంలోని జడ్పీ హైస్కూలు అప్పట్లో సమీప గ్రామాలకు ఒక్కగానొక్క ఉన్నత పాఠశాల. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి ఎందరో విద్యార్థులు ఈ పాఠశాలలో విద్యను అభ్యసించారు. అప్పట్లో పాఠశాలలో ల్యాబ్, లైబ్రరీ, తాగునీరు, మరుగుదొడ్లు ఉండేవి కావు. అప్పట్లో ఆ పాఠశాలలో చదువుకున్న సుమారు 15 మంది విద్యార్థులు తమను తీర్చిదిద్దిన బడి రుణం తీర్చుకునేందుకు నిర్ణయించుకున్నారు.

**పాత విద్యార్థుల సంఘం ఆవిర్భావం**

2015లో తొలిసారిగా పాత విద్యార్థుల సమ్మేళనానికి తొలి అడుగు పడింది. జూనియర్స్, సీనియర్స్ అనే తేడా లేకుండా సుమారు 15 మంది తాళ్లమాపురం జడ్పీ హైస్కూలు పాత విద్యార్థుల సంఘంగా ఏర్పడ్డారు. పాఠశాలలో మౌలిక వసతుల మెరుగుపై ఎప్పటికప్పుడు ప్రధానోపాధ్యాయులు, సిబ్బందితో చర్చించి పాఠశాల అభివృద్ధికి నడుం బిగించారు. రిటైర్డు హెడ్మాస్టర్ గోపీనాథరెడ్డి హయాంలో పాఠశాల అభివృద్ధి పరుగులు తీసింది. ఆయన తన హయాంలో ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు రాబట్టి, సౌకర్యాలు సమకూర్చగా మిగిలిన అంశాలను ఈ సంఘ సభ్యుల సహకారంతో కృషి చేశారు. పదవీ విరమణ అనంతరం ఆయన కూడా పూర్వ విద్యార్థుల సంఘంలో తాను ఒకరిగా చేరారు. ఆ తర్వాత వచ్చిన ప్రధానోపాధ్యాయులు కూడా పాత విద్యార్థుల కృషిని అభినందిస్తూ వారి సహాయ సహకారాలతో పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్నారు.

**మౌలిక వసతులపై దృష్టి**

పాఠశాలలో దయనీయ స్థితిలో ఉన్న మరుగుదొడ్లకు టైల్స్, గులాబి కంచె వేయించారు. తలుపులను మార్చారు. ఓవర్‌హెడ్ ట్యాంకుఏర్పాటు చేశారు. కంప్యూటర్, సిబ్బంది గదుల్లో ఫ్లోరింగ్‌కు మరమ్మతులు చేశారు. మధ్యాహ్న భోజనం కోసం సుమారు 250 ప్లేట్లను అందజేశారు. 2015 నుంచి 2019 వరకు అన్ని తరగతుల విద్యార్థులకు ప్రతి సంవత్సరం నోట్‌బుక్కులు, స్టేషనరీ అందించారు. సుమారు లక్ష రూపాయల వ్యయంతో ఆర్వో ప్లాంటును సమకూర్చారు. దీని నిర్వహణను ఏటా నిధులను అందిస్తున్నారు. ప్రతి సంవత్సరం స్వాతంత్ర్య, గణతంత్ర్య దినోత్సవాల సందర్భంగా విద్యార్థులకు పోటీలు నిర్వహించి పాఠ్యేతర కార్యకలాపాలకు ఏటా రూ.30 వేలు ఖర్చు చేస్తున్నారు. పాఠశాల లైబ్రరీకి పుస్తకాలు అందించారు. . 9, 10 తరగతుల విద్యార్థుల కోసం ప్రతి సంవత్సరం కొత్త కొశ్చన్‌బ్యాంక్ పుస్తకాలను అందిస్తున్నారు. పరీక్షలకు మార్గ దర్శనం చేసే వివిధ మ్యాగజైన్లను సమకూరుస్తున్నారు.





పాఠశాలలో పూర్వ విద్యార్థులు ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్, క్రికెట్ నెట్

**క్రీడలకు ప్రోత్సాహం**

మండల, జిల్లాస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొనే విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్లు, డ్రస్సులను అందజేస్తున్నారు. విజేతలకు బహుమతులు అందిస్తున్నారు. స్కౌట్స్, గైడ్స్‌ల విద్యార్థుల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించేందుకు యూనిఫాంలను అందజేశారు. పాఠశాల కార్యాలయంలో ఇన్వర్టర్లను, ల్యాప్‌టాప్, ప్రింటర్ తదితర ఉపకరణాలను అందుబాటులో ఉంచారు. సైన్స్ ల్యాబ్ పరికరాలు, సామగ్రిని అందుబాటులోకి తెచ్చారు. నూతనంగా నిర్మించిన గదులకు సుమారు రూ.60 వేలతో టైల్స్ ఏర్పాటు చేశారు. ఇటీవల క్రికెట్ క్రీడల్లో విద్యార్థులను ప్రోత్సహించడానికి పాఠశాల ఆవరణంలో క్రికెట్ కిట్, నెట్‌పిచ్‌ను ఏర్పాటు చేశారు. బలహీనంగా ఉన్న తరగతి గది తలుపులను, తాళాలను మరమ్మతులు చేయించారు. పాఠశాల గోడలపై పెయింటింగ్ వేయించి క్రీడలు, గణితం, సైన్స్, పరిజ్ఞానం పెంచే చిహ్నాలతో కూడిన రంగుల చిత్రాలను వేయించారు. గడిచిన పదేళ్లలో రూ.9,92,844లను ఖర్చు చేశామని పాత విద్యార్థుల సంఘం తెలిపారు. సరైన దిశలో చొరవ తీసుకుని వాటిని క్షేత్రస్థాయిలో అమలు చేసేందుకు ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది, సహకారాలను తీసుకుంటున్నారు.

**అభివృద్ధికి పెద్దపీట**

హెడ్మాస్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించాను. ఇక్కడి సౌకర్యాలు, వసతులను గమనించాను. ఇందులో పాతవిద్యార్థుల సంఘం కృషి ఎంతగానో కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. పాఠశాల ఉన్నతికి ఎంత ఖర్చు అయినా వెనుకాడే పరిస్థితి లేదని ఎలాంటి అవసరమైన తమ దృష్టికి తీసుకురావాలని విద్యార్థులు నాతో కూడా సంప్రదించారు. దాతల సహకారం పాఠశాలకు పుష్కలంగా ఉంది.

- విజయకుమారి, ప్రధానోపాధ్యాయురాలు

## 'రక్తదానంతో బాధితుల్లో భరోసా..'

కడప కలెక్టరేట్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రక్తదానం చే ద్దాం.. బాధితుల్లో భరోసా నింపు దామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖా ధికారి డాక్టర్ నాగరాజు పిలుపు నిచ్చారు. శుక్రవారం ప్రపంచ రక్తదాన దినోత్సవంలో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, ఏపీ ఎస్ఏసీఎస్ ఆదేశాల మేరకు నగరంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, రీజనల్ బ్యాంకు, ప్రభుత్వ రక్తనిధి, సర్వజన ఆసుపత్రి (జీపీహెచ్)వారి సహకారంతో మెగా బ్లడ్ డొనేషన్ కార్యక్రమాన్ని ఎస్‌బీఐ చీఫ్ మేనేజరు కృష్ణ కిశోర్‌తో కలిసి డీఎంహెచ్‌వో ప్రారంభించారు. స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా 75వ వార్షికోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ జూన్ 14వ తేదీ ప్రపంచ రక్తదాతల దినోత్సవం నిర్వహించడం జరుగుతోందన్నారు. సర్వజన ఆసుపత్రి, ఇతర బ్లడ్‌బ్యాంకు వారు వారం రోజుల పాటు స్వచ్ఛంద రక్తదాన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. రిమ్స్ బ్లడ్ బ్యాంకు వారు స్థానిక ఎయిర్‌పోర్టులో ఉదయం 10 గంటలకు రక్తదాన అభినందన కార్యక్రమాలు, రక్తదాన శిబిరం నిర్వహించడం జరుగుతోందని, రక్తదాతలు పాల్గొని విజయ వంతంచేయాలని డీఎంహెచ్‌ఓ, జిల్లా ఎయిడ్స్ కంట్రోల్ అధికారి డాక్టర్ రవిబాబులు పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజరు అనిల్‌కుమార్, బ్లడ్‌బ్యాంకు డాక్టర్ రాజేంద్ర, క్లస్టర్ ప్రోగ్రామ్ అధికారి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్మారకాలుగా చింతకుంట రేఖాచిత్రాలు

ముద్దనూరు జూన్13(ఆంధ్రజ్యోతి): చింతకుంట ఆదిమానవుడి రేఖా చిత్రాలను జాతీయ స్మారకాలుగా గుర్తించాలని అమరావతి అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ జాస్తి వీరాంజనేయులు ప్రధానమంత్రి నరేంద్రమోడీకి లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు. ఇందుకు స్పందించిన ప్రధాన మంత్రి కార్యాలయం ఆ విజ్ఞప్తిని పరిశీలించాలని కేంద్ర సాంస్కృతిక,మంత్రిత్వ శాఖకు పంపింది. ప్రస్తుతం చింతకుంట ఆదిమానవుడి రేఖాచిత్రాలు జాతీయ స్మారకాలుగా గుర్తించే ప్రక్రియ కొనసాగుతున్నట్లు తెలుస్తోంది.

## నవధాన్యాల సాగు లాభదాయకం

వల్లూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): వరి సాగుకు ముందు నవధాన్యాల సాగుతో లాభాలు ఉంటాయని జిల్లా పీఎండీఎస్ ప్రాజెక్టు మేనేజరు ప్రవీణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పెద్దపుత్త గ్రామంలో స్థానిక రైతు తాడిగొట్ల రామవరెడ్డి పొలాన్ని ఆయన సందర్శించారు. పంట వేసుకునే ముందు భూమిలో నవధాన్యాలు సాగు చేసుకుంటే భూమిలో పోషకపదార్థాలే కాకుండా భూమి కూడా సారవంతం అవుతుందన్నారు. అలాగే పంటకు వచ్చే తెగుళ్లను కూడా అరికట్టవచ్చన్నారు. ఎరువుల వాడకం కూడా తక్కువగా ఉంటుందన్నారు. వరి సాగు చేసేముందు ఘనజీవామృతం, జీవామృతం తప్పకుండా వాడుకోవాలని సూచించారు. ప్రొఫెసరు భరత్‌కుమార్‌రెడ్డి, ఎన్ఎఫ్ఏ నరసింహారెడ్డి, వెంకట్రామిరెడ్డి, యూనిట్ ఇన్‌చార్జ్ ఓబులయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, రిసోర్స్ సర్సన్స్ విజయలక్ష్మి, ఓబులమ్మ పాల్గొన్నారు.

## అనుమానాస్పద స్థితిలో యువతి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

కలసపాడు, జూన్ 13 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని జాతి వర్తిపల్లె- చింతలపల్లె మధ్యలో శుక్రవారం ఎలిజబెత్ (22) అనే యువతి అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. గ్రామస్థులు అందించిన సమాచారం మేరకు పోరుమామిళ్ల మండలం కవలకుంట్ల గ్రామానికి చెందిన నారిపోగుల ఓబయ్య కుమార్తె ఎలిజబెత్ తమిళనాడులో మహిళలు, యువతులకు కుట్టుమిషన్‌లో శిక్షణ ఇప్పిస్తూ సామాజిక సేవ చేస్తుంటుంది. రెండు నెలల క్రితం తల్లి దండ్రులు పెళ్లి సంబంధం చూడగా ఆమె తిరస్కరించింది. శుక్రవారం జాతివర్తిపల్లె -చింతలపల్ల మధ్య ప్రధాన రహదారి పక్కన ఆమె మృతదేహం పడి ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోరుమామిళ్ల, కలసపాడు పోలీసులు సంఘటన స్థలాన్ని సందర్శించి విచారణ చేస్తున్నారు. మృతురాలి సోదరుడు, బాబాయిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. మృతదేహాన్ని పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## ఉరి వేసుకుని.. వివాహిత ఆత్మహత్య

కాశినాయన, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓబుళాపురం గ్రామానికి చెందిన నీలం అనురాధ(28)అనే వివాహిత ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ యోగేంద్ర తెలి పారు. మండలంలోని చింతల పల్లెకు చెందిన అంకయ్య కూతురు అనూరాధను ఐదేళ్ల క్రితం ఓబు ళాపురం గ్రామానికిచెందిన నీలం వెంకటరమణయ్య కుమారుడు వెంకటేశ్వర్లుకు ఇచ్చి వివాహం చేశారు. వారికి ప్రస్తుతం మూడేళ్ల కూతురు ఉంది. సీఆర్‌పీఎఫ్ లో పని చేసే వెంకటేశ్వర్లు ఇటీవల సెలవుపై గ్రామానికి వచ్చి, నాలుగు రోజుల క్రితమే డ్యూటీకి వెళ్లా డు. ఈ నేపథ్యంలో శుక్రవారం మధ్యాహ్నం ఫ్యానుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఆత్మహత్యకు కారణాలు పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.

## ప్రొద్దుటూరులో వ్యక్తి..

ప్రొద్దుటూరు రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. టూ టౌన్ ఎస్ఐ ధనుంజయుడు తెలిపిన వివరాల మేరకు ప్రొద్దుటూరు పట్టణంలోని విజయనగరం వీధికి చెందిన రెడ్డిబీర రవిశంకర్ (36) ఆటోడ్రైవర్. మద్యానికి బానిసై సుమారు రూ.5 లక్షల దాకా అప్పులు చేశాడు. వీటిని తీర్చే మార్గం కానరాక గురువారం ఉదయం ఇంటినుంచి ఆటో తీసుకుని వెళ్లిపోయాడు. శుక్రవారం ఉదయం జమ్మలమడుగు బైపాస్‌రోడ్డులోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న ఖాళీ స్థలంలో ఓ చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల సమాచారం మేరకు సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతుడు రవిశంకర్‌గా గుర్తించారు. అతని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ..

కడప క్రైం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కడప - కృష్ణాపురం రైల్వేస్టేషన్ల మధ్య ఓ వ్యక్తి రైలు కింద పడి మృతి చెందినట్లు కడప రైల్వే పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు మృతి చెందిన వ్యక్తి వయసు 35 ఉంటుందని,తెల్లని ఫుల్‌హ్యాండ్ చొక్కాపై నీలం రంగు పూలు ఉన్నాయని, బ్లూ కలర్ లోయర్ ధరించి ఉన్నాడని తెలిపారు. వివరాలకు రైల్వే ఎస్సై 9440900811 కు ఫోన్ చేసి మరింత సమాచారం తెలుసుకోవాలని కోరారు.

## రూ. 1.20 కోట్లతో కేసీ ప్రధాన కాలువ అభివృద్ధి



కేసీ కాల్వలో పూడిక తీస్తున్న చైర్మన్ వెంకటసుబ్బారెడ్డి

చెన్నూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కేసీ ప్రధాన కాల్వలో పూడికతీతతో పాటు, ఆయకట్టు రోడ్లు, ఉప కాల్వల అభివృద్ధి పనులకు 1,20,64,000 రూపాయలు మంజూరైంది. కేసీ ప్రధాన కాల్వలో పూడిక తొలగించడంతోపాటు ఆయకట్టు రోడ్లు బాగు చేయాలని రైతులు కోరినా ఫలితం లేకుండా పోయింది. అయితే, ప్రస్తుత ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో 15 పనులను చేపడుతున్నారు. ఇందులో కేసీ ప్రధాన కాల్వలో ఐదు చోట్ల పూడిక తీత పనులకు రూ. 39.89 లక్షలను వెచ్చిస్తున్నారు. ఈ పనుల్లో మూడు ప్రధాన కాలువకు సంబంధించినవి కాగా, మిగిలినవి చెన్నూరు, కొక్కి రాయపల్లె కాల్వలు. ఉప్పరపల్లె, ఖాదర్‌ఖాన్ కొట్టాలు, శేషయ్యగారి పల్లె, చిన్నమాచుపల్లె వద్ద ఉన్న ప్రధాన కాల్వపై ఆయకట్టు రోడ్లను వేయనున్నారు. ఈ పనులకు ఒక్కోదానికి రూ.7.97 లక్షలు మంజూరైంది. గోపవరం, చెన్నూరు, ఉప్పరపల్లె ప్రాంతాల్లో కేసీ ఉప కాల్వలకు ఆయకట్టు రోడ్లు వేస్తున్నారు. కొండ పేట చెరువుకు వెళ్లే డిస్ట్రిబ్యూటరీ కెనాల్‌లో పూడిక తీతతో పాటు రూ.7.98 లక్షలతో రోడ్డు వేయనున్నారు. చెన్నూరు ఉప కాల్వ పరిధిలో గ్యాస్ గోడౌన్ నుంచి రూ. 7.99 లక్షలతో ఆయకట్టు రోడ్డు, వల్లూరు మండలంలోని ఆదినిమ్మాయ పల్లె ఆనకట్ట వద్ద 8.99 లక్షలతో ఆయకట్టు రోడ్డు వేస్తున్నారు.

**పనులు ప్రారంభించిన డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్**

కేసీ ప్రధాన కాల్వలో పూడిక తీత పనులను డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ టి.వెంకటసుబ్బారెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ముందుగా ఆదినిమ్మాయపల్లె ఆనకట్ట నుంచి మొదలయ్యే ప్రధాన కాల్వలో పూడికతీత పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఏఏ పనులు అవసరమో, ఎక్కడెక్కడ పనులు చేపట్టాలన్న విషయాన్ని ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన స్పందించి నిధులు మంజూరు చేయించారన్నారు. ముళ్లపొదలు పెరగడంతో మూసుకుపోయి ఆయకట్టు రోడ్ల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు.

## బదిలీలు పారదర్శకంగా నిర్వహించాలి

- మెడికల్ ఆర్డీకి ఎన్జీవో సంఘ నేతల వినతి



మెడికల్ ఆర్డీకి వినతిపత్రం అందజేస్తున్న ఎన్జీవో నేతలు

కడప,కలెక్టరేట్, జూన్13,(ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్యశాఖలో బదిలీలు పారదర్శకంగా నిర్వహించాలని వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ రామగిడ్డయ్యకు ఏపీ ఎన్జీవో సంఘ నేతలు విన్నవించారు. శుక్రవారం పాత రిమ్స్‌లో సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, ఇతర జిల్లాల నాయకులు ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏపీఎన్జీవో సంఘం నాయకుల బదిలీల్లో ఆఫీసు బేరర్లకు ప్రభుత్వం ఇచ్చిన 9 ఏళ్ల మినహాయింపు ఇవ్వాలన్నారు. ఆఫీసు బేరర్లు జాయిన్ అయినప్పటి నుంచి వారి సర్వీసు కాలాన్ని లెక్కించాలని కోరారు. జీఏడీ సర్క్యులర్ మెమోలో ఈ విషయాన్ని స్పష్టంగా పేర్కొన్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో కర్నూలు జిల్లా అధ్యక్షుడు వెంగళరెడ్డి ,అనంతపురం జిల్లా అధ్యక్షుడు చంద్ర శేఖర్ రెడ్డి, రాష్ట్ర సహాధ్యక్షుడు దస్తగిరి రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రసాద్ యాదవ్, జిల్లా కార్యదర్శులు రవికుమార్, చంద్రమోహన్, బాల పుల్లయ్య, హుసేన్ రెడ్డి, వేణుగోపాల రెడ్డి, ప్రవీణ్, రాంమోహన్, పద్మనాభం వివిధ యూనిట్ల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

## వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు దుర్మరణం



రవి



వినోద్

(ఫైల్ ఫొటోలు)



వినీల్‌కుమార్‌రెడ్డి (ఫైల్‌ఫొటో)

కడప క్రైం/మైదుకూరు రూరల్, జూన్ 13 (ఆంధ్ర జ్యోతి): వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రెండు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందారు. కడప ట్రాఫిక్ ఎస్ఐ జయరాములు కథనం మేరకు.. కడప చలమా రెడ్డిపల్లెకు చెందిన నంద్యాల రవి (32) ప్రైవేటు పనులు చేస్తుంటాడు. రాయచోటి వినోద్ (26) ప్రైవేటు ఫైనాన్స్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఈ ఏడాది కడపకు చెందిన యువతితో అతనికి వివాహం జరిగింది. వినోద్ భార్య ప్రస్తుతం గర్భిణి. శుక్రవారం రవి, వినోద్ ఆలంఖాన్ పల్లెకు వెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా వారు ప్రయాణి స్తున్న స్కూటీని షిరిడి సాయి ఎలక్ట్రికల్స్ సంస్థకు చెందిన క్యాంపర్ రామాంజనే యపురం నుంచి ఆలంఖాన్‌పల్లె రింగు రోడ్డువైపు వెళుతూ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇరువురు అక్కడికక్కడే మృతి చెందారు. పోలీ సులు మృతదేహాలను రిమ్స్ మార్చురీకి తర లించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

**కారు ఢీకొని..**

మైదుకూరు మండలంలోని నెల్లూరు కొట్టాలుకు చెందిన కొండా వినీల్ కుమార్ రెడ్డి(44) అనే యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. గురువారం మధ్యాహ్నం పాతపాలెం వద్ద నడుచుకొంటు మైదుకూరు వైపు వస్తుం డగా వెనుక నుంచి కారు ఢీకొనగా అతను ఆసుపత్రిలో చికిత్స చేసుకొని ఇంటికి వెళ్లాడు. శుక్రవారం తెల్లవారు జామున ఉన్నట్లుండి మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

## ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ టోర్నీలో చిత్తూరు, కడప జట్ల విజయం



రణధీర్‌రెడ్డి



ఆర్థిత్‌రెడ్డి



సాయితేజశ్రీ

కడప స్పోర్ట్స్ జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న ఏసీఏ అండర్-19 మెన్స్ ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ మ్యాచ్‌లలో శుక్రవారం చిత్తూరు, కడప జట్లు ఆధిక్యం ప్రదర్శించాయి

**ఏసీఏ క్రికెట్ స్టేడియంలో..**

నగరంలోని వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ స్టేడియంలో టాస్ నెగ్గిన అనంతపురం జట్టు నిర్దేత 50 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 229 పరుగులు చేసింది. ఇందులో భువనేశ్వర్ 65 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు 33.4 ఓవర్లలో కేవలం 3 వికెట్లు మాత్రమే కోల్పోయి 231 పరుగులు సాధించి విజయకేతనం ఎగురవేసింది. లోహిత్ లక్ష్మీనారాయణ 125 పరుగులతో నాటౌట్‌గా నిలిచి విజయంలో కీలకపాత్ర పోషించాడు.

**కేఎస్ఆర్ఎం మైదానంలో..**

కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో టాస్ నెగ్గిన కడప జట్టు 48.4 ఓవర్లలో 243 పరుగులకు ఆలౌటైంది. ఈ జట్టు క్రీడాకారులు రణధీర్‌రెడ్డి 65 పరుగులు, ఆర్థిత్‌రెడ్డి 61 పరుగులతో నాటౌట్‌గా నిలిచారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు 37.5 ఓవర్లలో 207 పరుగులకు ఆలౌటైంది. ఇందులో తోషిత్‌యాదవ్ 77 పరుగులు చేశాడు. దీంతో కడప జట్టు 36 పరుగుల తేడాతో విజయం సాధించింది.

**మహిళా క్రికెట్‌లో కడప జట్టు విజయం**

నెల్లూరులో జరుగుతున్న ఏసీఏ అండర్-15 ఉమెన్ ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ పోటీల్లో శుక్రవారం కడప- నెల్లూరు జట్లు తలపడ్డాయి. టాస్ నెగ్గిన కడప జట్టు బ్యాటింగ్‌కు దిగి నిర్దేత 25 ఓవర్లలో 1 వికెట్ కోల్పోయి 200 పరుగులు చేసింది. ఇందులో సాయితేజశ్రీ 113 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు 25 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 115 పరుగులు మాత్రమే చేసి ఓటమి చవిచూసింది. దీంతో కడప జట్టు 85 పరుగుల భారీ తేడాతో గెలుపొందింది.



**MUNICIPAL CORPORATION KADAPA**

"ap' e-procurement Tender Notice.

813860 & 813854/ATO/MCK dt: 14.06.2025

| S. No. | Description | No. of works | Ecv. Rs. in Lakhs |
|---|---|---|---|
| 01. | General Funds | 16 | 124.13 |
| 02. | NCAP | 02 | 148.00 |
| | TOTAL:- | 18 | 272.13 |

| | Bid Document Download Start Date | Bid Document Download End Date | Bid Submission Closing Date & Time |
|---|---|---|---|
| 04 | 11/06/2025 11.30 AM | 18/06/2025 12.00 PM | 18/06/2025 12.45 PM |
| 01 | 13/06/2025 03.30 PM | 16/06/2025 03.00 PM | 16/06/2025 03.30 PM |
| 13 | 13/06/2025 03.30 PM | 27/06/2025 03.00 PM | 27/06/2025 03.30 PM |

Further details can be seen at 'e' Procurement market place in www.apeprocurement.gov.in officer inviting bid, Commissioner, Municipal Corporation of Kadapa, A.P.

COMMISSIONER,
KADAPA MUNICIPAL CORPORATION,
YSR DISTRICT

## ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం సక్సెస్

● టీడీపీ రాజంపేట పార్లమెంటు ఉపాధ్యక్షుడు రమేష్‌బాబు

రైల్వేకోడూరు, జూన్ 13(ఆంధ్రజ్యోతి):ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం సక్సెస్ అయిందని టీడీపీ రాజంపేట పార్లమెంటు ఉపాధ్యక్షుడు పుల్లెల రమేష్‌బాబు తెలిపారు. శుక్రవారం రైల్వేకోడూరులో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇది మంచి ప్రభుత్వం అని నిరూపంచుకుందన్నారు. అమరావతి రైతులను రోడ్లపైన పెట్టలేదన్నారు. పేదల కడుపు నింపాలని అన్న క్యాంటిన్లను ప్రారంభించిందన్నారు. అస్తవ్యస్తమైన రోడ్లను బాగు చేసిన ఘనత కూటమి ప్రభుత్వందే అని కొనియాడారు. వైసీపీ ప్రభుత్వంలో పారిపోయిన కంపెనీలు మళ్లీ వచ్చేశాయన్నారు. ఎస్సీఎస్టీ,మైనార్టీలపైన అరాచకాలు, హత్యలు జరగలేదన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ గాడితప్పిన పరిపాలనను మళ్లీ గాడిలో పెట్టారన్నారు. రాష్ట్రంలో గంజాయి లేకుండా చేశారన్నారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడానికి ప్రభుత్వం బాధ్యత తీసుకుంద న్నారు. అయినా ప్రతిపక్షాలు కూటమి ప్రభుత్వంపై బురదజల్లడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు బొబ్బిలి రాజేష్, ఎర్రబల్లి శ్రీను, తిప్పన మురళి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల ప్రారంభంలోనే విద్యార్థులకు కిట్‌లు

రాజంపేట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి):విద్యార్థులకు పాఠశాల పునఃప్రారంభం సందర్భంగా రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లను ప్రధానోపాధ్యాయురాలు భారతి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బోయనపల్లె పాఠశాలలో శుక్రవారం ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మొదటిరోజే విద్యార్థులకు కిట్‌లను అందజేశామన్నారు. ఉపాధ్యాయులు పి.జనార్దన్, బి.శేషగిరి, ఎస్‌వి రామరాజు, ఎ.శివప్రసాద్‌గౌడ్, ఎస్.ప్రభాకర్‌రావు, ఎం.చెన్నకేశవులు, పి.విజయభాస్కర్, ఓబులేసు, శ్రీరాములు, అనిల్, రాజయ్య, ఈశ్వర్‌నాయక్, ప్రసాద్, అమరావతి, దార్ల శ్రీనివాసులుఆచారి పాల్గొన్నారు.

## భూసార పంటలకు అనుగుణంగా ఎరువులు వేసుకోవాలి



పైరును పరిశీలిస్తున్న ఏవో రమేష్‌రెడ్డి

సిద్దవటం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : పంటల సాగు కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన భూసార పరీక్షలకు అనుగుణంగా ఎరువులు వాడకం వల్ల రైతులకు ఖర్చులు చాలావరకు తగ్గింపు అవుతాయని మండల వ్యవసాయాధికారి రమేష్‌రెడ్డి తెలిపారు. మండలంలోని వంతాటిపల్లె, టక్కోలి గ్రామాల్లో ఆయన శుక్రవారం వరినారు మడులను పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి రమేష్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు వరినాట్లు నాటే ముందు 20 కిలోలు జింక్ సల్ఫేట్‌ను దుక్కిలో వేసుకోవాలని వేసిన తర్వాత నాలుగైదు రోజుల్లో ఒక ఎకరాకు ఒక బస్తా డీఏపీ లేదా సింగిల్ సూపర్ పాస్ఫేట్(ఎస్ఎస్‌పీ) దుక్కిలో ఒక ఎకరాకు మూడు బస్తాలు వేసుకోవాలన్నారు. వరినారు పెరికే పదిరోజుల ముందు వరిలో కాండం తొలచుపురుగు, ఉల్లికోడు రాకుండా ఉండడానికి కార్బోపిరాన్ 3జి, గుళికలు నారుమడిలో వేసుకోవాలని రైతులు సూచించారు.

## విమాన ప్రమాద మృతులకు శ్రద్ధాంజలి



కొవ్వొత్తులతో శ్రద్ధాంజలి ఘటిస్తున్న నాయకులు

నందలూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాదులో జరిగిన విమాన ప్రమాద ఘటనలో మృతిచెందిన వారి కుటుంబాలకు శుక్రవారం రాత్రి అరవపల్లెలోని ఆర్ఎస్ రోడ్డులో లయన్స్‌క్లబ్, వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులు వెలిగించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మన్నెం రామ్మోహన్, వాకర్స్ కార్యదర్శి ఉప్పుశెట్టి సుధీర్‌లు మాట్లాడుతూ ప్రమాదం ఊహించని పరిణామమని, ప్రతిఒక్కరు సంఘటితంగా సంతాపం తెలపాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. విభ ఎరుడైట్ స్కూల్ ఛైర్మన్ డాక్టర్ జయభాస్కర్‌రావు, లయన్స్‌క్లబ్ అధ్యక్షులు కుర్రా మణియాదవ్, మోడపోతుల రాము, గురుప్రసాద్, గండికోట కృష్ణకుమార్, కానకుర్తి వెంకటయ్య, కొత్తపల్లె రాజాచారి, తాటి సుబ్బరాయుడు, ఆంజనేయులు పాల్గొన్నారు.

**రైల్వేకోడూరు రూరల్:** పట్టణంలోని భుజంగేశ్వరస్వామి ఆలయ పరిసన ప్రాంతంలో శ్రీకృష్ణదేవరాయ సర్కిల్ వద్ద కొవ్వొత్తులతో శ్రద్ధాంజలి ఘటించారు. బీజేపీ సీనియర్ నాయకులు మాజీ రాష్ట్ర కిసాన్ మోర్చా హార్టికల్చర్ కన్వీనర్ తోట శ్రీనివాసులు, నాయకులు పాల్గొన్నారు.

## బీజేపీ మండల నాయకుడిపై దాడి



గాయపడిన రాజగోపాల్‌రెడ్డి

ఓబులవారిపల్లె, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాదెల గ్రామ పంచాయతిలోని తల్లెంపల్లె గ్రామానికి చెందిన బీజేపీ మండల నాయకులు చిన్నరెడ్డి రాజగోపాల్‌రెడ్డిపై అదే గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్తలు దాడి చేయడం జరిగిందని పోలీసులు తెలిపారు. క్షతగాత్రునికి తలపైన గాయం కావడంతో రైల్వేకోడూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## 'బూటకపు ఎన్‌కౌంటర్లను వెంటనే ఆపాలి'

రాయచోటిటౌన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ కగారు పేరుతో కేంద్రం జరుపుతున్న బూటకపు ఎన్‌కౌంటర్లను వెంటనే ఆపాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బంగారురావు డిమాండ్ చేశారు. శుక్రవారం రాయచోటి పట్టణంలో సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ అన్నమయ్య జిల్లా కమిటీ సమావేశం జరిగింది.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులను ముందస్తుగా కస్టడిలోకి తీసుకుని విచారణ, న్యాయ ప్రక్రియ పాటించకుండా అతికిరాతకంగా చంపుతూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ అన్నమయ్య జిల్లా కార్యదర్శి మావులూరి విశ్వనాద్, జిల్లా కమిటీ సభ్యులు సిగి చెన్నయ్య, వీ. రమణ, సుజాత, సుబ్బయ్య, జయసింహ, అంజినేయులు, తుమ్మల లవకుమార్ పాల్గొన్నారు.

# ఫుట్‌పాత్‌లనూ వదలని వ్యాపారులు

**● అవస్థలు పడుతున్న ప్రయాణికులు ● పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు**



ఫుట్‌పాత్‌ను ఆక్రమించిన దృశ్యం

ఒంటిమిట్ట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కాదేదీ కబ్జాకనర్హం అన్నట్లు ఒంటిమిట్టలో వ్యాపారులు ఫుట్‌పాత్‌లను కూడా వదలడం లేదు. స్థానిక పోలీసుస్టేషన్ నుంచి కోదండరామాలయం వరకు రోడ్డుకిరువైపులా అధికారులు ఫుట్‌పాత్‌లను ఏర్పాటు చేశారు. కానీ ఇవి ప్రయాణికులకు కాకుండా వ్యాపారులకు ఉపయోగపడుతున్నాయి. కారణం వ్యాపారులు తమ సరకులు ఫుట్‌పాత్‌లపై పెట్టి విక్రయిస్తున్నారు. దీంతో పాదచారులు రోడ్డుపై నడవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కడప - చెన్నై ప్రధాన రహదారిన ఒంటిమిట్ట ఉండడంతో ప్రతి నిత్యం వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. భారీ వాహనాలు అధిక సంఖ్యలో వెళుతుంటాయి. వాటిని దృష్టిలో ఉంచుకుని ఆర్‌అండ్‌బి అధికారులు ఫుట్‌పాత్‌లను ఏర్పాటు చేశారు. ప్రయాణికులు ఫుట్‌పాత్‌లపై కాకుండా రోడ్డుపై నడుచుకుంటూ వెళితే ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని పలువురు పేర్కొంటున్నారు. ప్రస్తుతం కోదండరామాలయానికి రాష్ట్ర గుర్తింపు రావడంతో ప్రతిరోజు సుమారు వెయ్యి మంది ఒంటిమిట్టకు వచ్చి బస్టాండు నుంచి రోడ్డుపై నడుచుకుంటూ ఆలయానికి వెళుతున్నారు. ఈ సమయంలో ప్రమాదాలు జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపై నడిచే ప్రయాణికులకు రక్షణ కరవైందని ప్రయాణికులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఫుట్‌పాత్‌లు ప్రయాణికులకు ఉపయోగపడేవిధంగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



### తొలగించకపోతే నోటీసులు జారీ చేస్తా

ఫుట్‌పాత్‌ను ఆక్రమించుకుని వ్యాపారం చేస్తున్న వారికి నోటీసులు జారీ చేస్తా. ఫుట్‌పాత్‌లపై సరుకులు తొలగించకుంటే చట్ట ప్రకారం వారిపై చర్యలు తీసుకుంటాం. కావున దుకాణదారులు స్వచ్ఛందంగా సహకరించాలి.

\- సుధాకర్, పంచాయతీ కార్యదర్శి, ఒంటిమిట్ట





### ప్రయాణికులకు చాలా ఇబ్బందిగా ఉంది

ఫుట్‌పాత్‌లను ఆక్రమించడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో వేరే గత్యంతరం లేక రోడ్డుపై నడుస్తున్నారు. రోడ్డుపై నడవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రయాణికులకు సౌకర్యంగా ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

\- సిగే భాస్కర్‌రెడ్డి, ఒంటిమిట్ట

## నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవు : ఎస్ఐ

ఓబులవారిపల్లె, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని ఎస్ఐ మహేష్ హెచ్చరించారు. శుక్రవారం జాతీయ రహదారిపై తనిఖీ చేపట్టారు. ఎస్ఐ మాట్లాడుతూ డ్రైవింగ్ లైసెన్సు, హెల్మెట్ లేని వాహనదారులకు జరిమానా విధిస్తామన్నారు.

## నేడు విద్యుత్‌కు అంతరాయం

రాజంపేట టౌన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లకు మరమ్మతులు చేపడుతున్న కారణంగా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీఎస్‌పీడీసీఎల్ డీఈఈ ఎం.సురేంద్రనాథ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరస్వతిపురం, తాళ్లపాక, బ్రాహ్మణపల్లె, ఆకేపాడు, నందలరు సబ్‌స్టేషన్లలో 11కెవి ఫీడర్‌కు సమీపంలో ఉన్న చెట్లను తొలగించి మరమ్మతులు చేపడుతున్నామన్నారు. రాజంపేట, నందలూరు పట్టణాలు, తాళ్లపాక, బ్రాహ్మణపల్లె, ఆకేపాడు చుట్టుపక్కల ప్రాంతాలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిలిపిస్తున్నామన్నారు. కావున విద్యుత్ వినియోగదారులకు సహకరించాలని కోరారు.

## ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అడ్మిషన్లు

చిట్వేలి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన చిట్వేలిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల ప్రవేశాలు ప్రారంభమయ్యాయి. ప్రదానోపాధ్యాయురాలు బి.దుర్గరాజు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు అడ్మిషన్ల ప్రక్రియను నిర్వహిస్తున్నారు. పాఠశాలకు అనుబంధంగా బాలురులకు సమీకృత వసతి గృహం, బాలికలకు ప్రత్యేకమైన మూడు వసతి గృహాలు ఉన్నాయి. వివిధ ప్రాంతాల నుంచి కూడా విద్యార్థులకు పాఠశాలల్లో చేరుతుంటారు. ఇప్పటివరకు పాఠశాలలో 40 అడ్మిషన్లు జరిగినట్లు ప్రధానోపాధ్యాయులు దుర్గరాజు తెలిపారు.

## నకిలీ మందులు, విత్తనాలను అరికట్టాలి

సంబేపల్లె, జూన్13(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో రైతులు పంటలు సాగు చేసుకునేందుకు వేరుశనగ, వరి, సన్‌ఫ్లవర్, టమోటా, మిరప తదితర విత్తనాలను 90 శాతం సబ్సిడీతో అందజేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సంబేపల్లె తహసీల్దార్ సుబ్రమణ్యంరెడ్డితో రైతు సమస్యలపై చర్చించి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాయచోటి ఏరియా రైతు సంఘం అధ్యక్షుడు హరినాథ్‌నాయుడు, సంబేపల్లె మండల గౌరవాధ్యక్షులు అర్జున్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మదన్‌మోహన్‌రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## లేబర్ కోడ్‌లు రద్దయ్యే వరకు పోరాటం: సీఐటీయూ



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు

రాయచోటిటౌన్, జూన్13(ఆంధ్రజ్యోతి): కార్మికుల నడ్డి విరిచేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ రద్దు అయ్యేంత వరకు ఐక్యంగా పోరాడదామని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక సీఐటీయూ కార్యాలయం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికులు ఏళ్ల తరబడి పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలు, హక్కులను బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ల ప్రయోజనాల కోసం వారిచ్చే కమీషన్‌లకు కక్కుర్తి పడి కార్మిక చట్టాలు, హక్కులు రద్దు చేసి వారిని కట్టు బానిసలుగా మార్చడం కోసం నాలుగు లేబర్ కోడ్స్ తీసుకురావడాన్ని ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నామన్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి భాగ్యలక్ష్మి, జిల్లా ఉపాధ్యక్షులు ఓబులమ్మ, ఏవీ రమణ, వెంకట్రామయ్య పాల్గొన్నారు.

## విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ



వీరబల్లి, జూన్13(ఆంధ్రజ్యోతి):రాజ్యసభ సభ్యులు, తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గాల పరిశీలకుడు మేడా రఘునాథరెడ్డి జన్మదినం పురస్కరించుకుని మండలంలోని తాటిగుంటపల్లి పంచాయతీ కొత్తపల్లి ప్రాథమిక పాఠశాలలో ఎంపీటీసీ యర్రపురెడ్డి పురుషోత్తంరెడ్డి విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. పాఠశాలలో శుక్రవారం ఆ యన కేక్ కట్ చేసి విద్యార్థులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యసభ సభ్యులు ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరిన్ని జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులకు అందరికీ నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెడ్మాస్టర్ వెంకట్రాజు, ఉపాధ్యాయుడు వెంకట్రమణలు పాల్గొన్నారు.

విద్యార్థులకు కేక్ తినిపిస్తున్న దృశ్యం

## మారమ్మతల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు

నందలూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాగిరెడ్డిపల్లె గ్రామంలో వెలసిన మారమ్మతల్లి దేవస్థానం నందు శుక్రవారం రాజ్యసభ సభ్యులు మేడా రఘునాధ్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఆలయ కమిటీ, గ్రామస్థులు కేక్ కట్‌చేసి పిల్లలకు, ప్రజలకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులు దుర్గారెడ్డి, నారాయణ, అరిగె హరిబాబు, వెంకటేశ్, మణి, కుంభగిరి గోపాల్, అనిల్, శివయ్య, కె.శివ పాల్గొన్నారు.

## తండ్రి అడుగుజాడల్లో నడుస్తా

● సుగవాసి ప్రసాద్‌బాబు



మాట్లాడుతున్న సుగవాసి ప్రసాద్‌బాబు

చిన్నమండెం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): తన తండ్రి అడుగుజాడల్లో నడుస్తానని రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్ బాబు అన్నారు. శుక్రవారం చిన్నమండెం మండల కేంద్రంలోని ఏర్పాటు చేసిన సుగవాసి పాలకొండ్రాయుడు సంస్మరణ సభకు ప్రసాద్ బాబు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాయచోటి నియోజకవర్గంలో ఏ ప్రాంతానికి వెళ్లినా పాలకొండ్రాయుడు చేసిన అభివృద్ధి, సంక్షేమ ఫలాలే కనిపిస్తున్నాయని, తమ తండ్రి అడుగుజాడల్లోని నడుచుకుంటానని పేర్కొన్నారు. ప్రతి వ్యక్తిని పేరు పేరునా గుర్తు పెట్టుకుని పిలిచే అంత చనువు మీతో మా తండ్రికి ఉండేదన్నారు. అలాగే తనను కూడా చేరదీసి ముందుకు నడిపించాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో పారిశ్రామికవేత్త ముంబై ఏజాద్‌ఖాన్, టీడీపీ మండల తెలుగు యువత అధ్యక్షుడు తౌహిద్‌ఖాన్, రహంతుల్లా, సైపుల్లా, బాల చంద్రయాదవ్, నాగభూషణం, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ మాన్యం విక్రయంపై తహసీల్దార్‌కు ఫిర్యాదు

వీరబల్లి, జూన్13(ఆంధ్రజ్యోతి): మండలంలోని పుల్లగూర గుడికి చెందిన ఆలయ మాన్యాల విక్రయంపై వీరబల్లి నారాయణ శుక్రవారం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. పుల్లగూర గండి ఆంజనేయ స్వామి ఆలయ మాన్యాన్ని తంగేళ్ల వంశస్థులు తమ కుటుంబానికి ధూపదీప నైవేద్యాల కోసం ఇచ్చారన్నారు. ఆ భూమిని అమ్మరాదు అనే నిబంధన ఉన్నప్పటికీ ఇతరులకు విక్రయించారని పేర్కొన్నారు.

## ఎళ్లవేళలా అందుబాటులో ఉంటా



డాక్టర్ ఈశ్వరప్రసాద్

సిద్దవటం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బదిలీల్లో భాగంగా అట్లూరు మండలం కమలకూర్ పశువైద్యశాల నుంచి మాచుపల్లె పశువైద్యశాలకు వెటర్నరి వైద్యాధికారిగా శుక్రవారం ఈశ్వర ప్రసాద్ బాధ్యతలు చేపట్టారు. స్థానిక డాక్టర్ శ్వేత రాయచోటి నియోజకవర్గం గువ్వలచెరువు పశువైద్యశాల వైద్యాధికారిణిగా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఈశ్వర ప్రసాద్ మాట్లాడుతూ జ్యోతి, మాచుపల్లె తదితర గ్రామాల్లో నిత్యం అందుబాటులో ఉంటానన్నారు.

## వీరబల్లి నూతన తహసీల్దార్‌గా ఖాజాబీ



బాధ్యతలు స్వీకరిస్తున్న తహసీల్దార్ ఖాజాబీ

వీరబల్లి, జూన్13(ఆంధ్రజ్యోతి): మండల నూతన తహసీల్దార్‌గా ఖాజాబీ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఎక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ వెంకటేశ్ ఇటీవల రామాపురం మండలానికి బదిలీ అయ్యారు. దీంతో కలెక్టరేట్‌లో పనిచేస్తున్న ఖాజాబీ నూతన తహసీల్దార్‌గా మండలానికి రావడం జరిగింది. ప్రజల సమస్యను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆమె తెలిపారు. అదేవిధంగా భూ సమస్యలపై అక్రమ రవాణాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు.

## రామాపురం తహసీల్దార్‌గా వెంకటేశ్వర్లు

రామాపురం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రామాపురం మండల తహసీల్దార్‌గా ఎస్.వెంకటేశ్వర్లు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వీరబల్లి మండలంలో తహసీల్దార్‌గా పనిచేస్తూ బదిలీపై రామాపురం మండలానికి వచ్చారు. రామాపురంలో తహసీల్దార్‌గా పనిచేస్తున్న రామాంజనేయులు రాయచోటి కలెక్టరేట్ సర్వే సెక్షన్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో రైతుల సమస్యలను తమ దృష్టికి వస్తే పరిష్కరిస్తామని తెలిపారు.

## లక్కిరెడ్డిపల్లె తహసీల్దార్‌గా క్రాంతికుమార్



తహసీల్దార్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

లక్కిరెడ్డిపల్లె, జూన్13(ఆంధ్రజ్యోతి): లక్కిరెడ్డిపల్లె మండల తహసీల్దార్‌గా క్రాంతికుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. రాయచోటి అన్నమయ్య జిల్లా కలెక్టరేట్‌లో సూపరిండెంట్‌గా పనిచేస్తూ లక్కిరెడ్డిపల్లెకు బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన శ్రీనివాసులు రాజంపేటకు బదిలీ అయ్యారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రెవెన్న, హరి ప్రసాద్, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ రాజేశ్, వీఆర్‌వోలు కృష్ణ, పుష్పరాజ్, వెంకోజి, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఒంటిమిట్ట ఎంపీడీవోగా సుజాతమ్మ



బాధ్యతలు చేపట్టిన సుజాతమ్మ

ఒంటిమిట్ట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : ఒంటిమిట్ట ఎంపీడీవోగా జె.సుజాతమ్మ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. కడప డీపీఆర్సీలో డీసీగా పనిచేస్తూ ఒంటిమిట్టకు బదిలీపై విచ్చేశారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీవో గౌస్‌బాషా కమలాపురానికి బదిలీపై వెళ్లారు. శుక్రవారం సాయంత్రం ఎంపీడీవో సుజాతమ్మ స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఒంటిమిట్ట పంచాయతీ కార్యదర్శి సుధాకర్ పాల్గొన్నారు.

## అద్భుత పథకం.. సూర్య ఘర్ యోజన

పుల్లంపేట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): గృహ వినియోగదారులకు అద్భుతమైన పథకం ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం అని రాజంపేట ట్రాన్స్‌కో ఈఈ రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక బైపాస్‌రోడ్డులో ఉన్న శ్రీనివాస కల్యాణమండపంలో ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజన పథకంపై వినియోగదారులకు అవగాహన కల్పిస్తూ సందేశాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఏఈ కుమార్, సిబ్బంది, వినియోగదారులు పాల్గొన్నారు.

## చౌడేశ్వరిజ్యోతి ఉత్సవాన్ని విజయవంతం చేయండి



ప్రత్యేక అలంకరణలో చౌడేశ్వరిదేవి

సంబేపల్లె, జూన్13(ఆంధ్రజ్యోతి): దేవపట్ల గ్రామం సీఎం కొత్తపల్లిలో నేడు నిర్వహించే చౌడేశ్వరిజ్యోతి ఉత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చే యాలని గ్రామస్తులు పిలుపునిచ్చారు. చౌడేశ్వరిజ్యోతి ఉత్సవం సందర్భంగా తొగటవీర క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో శనివారం నాలుగు గంటల నుంచి జ్యోతులను రాత్రి 9 గంటల వరకు తయారు చే స్తారన్నారు. ప్రతి ఒక్కరూ అమ్మవారి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గ్రామస్తులు కోరారు.

# తల్లికి వందనంపై మహిళల హర్షం



తల్లికి వందనం పథకంపై జాబితా చూస్తున్న తల్లిదండ్రులు

సిద్దవటం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల్లో చెప్పిన వాగ్దానం మేరకు తల్లికి వందనం పథకం అమలు చేసినందుకు కూటమి ప్రభుత్వంపై పిల్లల తల్లుల హర్షం వ్యక్తం చేశారు. మండలంలోని గ్రామ సచివాలయాల్లో ఏర్పాటు చేసిన తల్లికి వందనం పథకం సూచికబోర్డు అమలుపరిచినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని ట క్కోలి, మాచుపల్లె, సిద్దవటం, ఉప్పరపల్లె తదితర గ్రామాల సచివాలయాల్లో ఏర్పాటు చేసిన తల్లికి వందనం పథకంపై అర్హులైన జాబితాపై తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టక్కోలి గ్రామ సచివాలయంలో లింగంపల్లె గ్రామనివాసి లక్ష్మీదేవి అనే మహిళ శుక్రవారం మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తల్లికి వందనం పథకం అమలు చేశారని, ఎంతమంది పిల్లలున్నా అందరికి వర్తించే విధంగా అమలు చేయడం హర్షించదగ్గ విషయమని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. పిల్లలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## విద్యార్థిని అదృశ్యంపై కేసు నమోదు

గుర్రంకొండ, జూన్ 13(ఆంధ్రజ్యోతి): విద్యార్థిని వైష్ణవి అదృశ్యంపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ గజేంద్ర తెలిపారు. టి.రాచపల్లెకు చెందిన దేవేంద్ర కుమార్తె అంగళ్లు సమీపంలోని ఓ ప్రైవేట్ కాలేజీలో ఇంటర్ పూర్తి చేసింది. గత నెల 20వ తేదీన ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్ష రాయడానికి అంగళ్లకు వెళ్లి తిరిగి స్వగ్రామానికి చేరుకుంది. అదే రోజు సాయంత్రం విద్యార్థిని ఇంటి నుంచి కనబడకుండా పోయింది. దీంతో కుటుంబ సభ్యులు బంధువులు, తెలిసిన వారిని విచారించిన ఆచూకీ తెలియకపోడంతో శుక్రవారం పోలీసులను ఆశ్రయించారు. పోలీసుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఏఎస్ఐ తెలిపారు.

## ట్రాక్టర్‌ను బావిలో పడేసిన దుండగులు



బావి నుంచి ట్రాక్టర్‌ను వెలికి తీస్తున్న దృశ్యం

పెద్దమండ్యం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): నిరుపేద యువకుడు ట్రాక్టర్ తోలుకుంటూ జీవిస్తుంటే ఆ ట్రాక్టర్‌ను బావిలో పడేసిన సంఘటన పెద్దమండ్యం మండలంలో గురువారం జరిగింది. బాధితుడు, గ్రామస్థుల కథనం మేరకు మండలంలోని బండమీదపల్లి వాసి నాగార్జున నిరుపేద కుటుంబం. కష్టపడి వ్యవసాయ కూలీ పనులు, డ్రైవర్ వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. 15 ఏళ్లు కష్టపడి కూడబెట్టుకున్న డబ్బుతో మూడేళ్ల కిందట రూ.7 లక్షలతో ఒక ట్రాక్టర్ తెచ్చుకుని బాడుగకు తోలుకుంటూ కుటుంబం జీవనం సాఫీగా సాగిస్తున్నాడు. గురువారం కూడా యధావిధిగా ట్రాక్టర్‌ను ఇంటి సమీపంలో పెట్టాడు. అర్ధరాత్రి మూత్ర విసర్జనకు లేచి చూస్తే ట్రాక్టర్ కనబడకపోవడంతో ఆందోళన చెందిన బాధితుడు సహచరులతో చుట్టు పక్కల ట్రాక్టర్ చక్రాలు జాడలు గమినించారు. గ్రామం సమీప వ్యవసాయ బావిలో పడి వున్నట్లు గుర్తించారు. శుక్రవారం పెద్దమండ్యం పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు విచారించి ఇలాంటి సంఘటన మళ్లీ జరగకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరారు. ఏడాదిగా పెద్దమండ్యం పోలీసు స్టేషన్‌లో సిబ్బంది కొరతతో గ్రామాల్లో రాత్రిళ్లు కాక పగలు కూడా గస్తీలు జరగలేదని ప్రజలు వాపోతున్నారు.

## రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి



ఓబులవారిపల్లె, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో మండలంలోని చిన్నఓరంపాడు పంచాయతీకి చెందిన పిడికిటి సుబ్రమణ్యం (73) అక్క టడికక్కడే దుర్మరణం చెందారు. పోలీసుల వివరాల మేరకు... సుబ్రమణ్యం ద్విచక్రవాహనంపై కడప-చెన్నై జాతీయ రహదారి రెడ్డిపల్లె చెరువుకట్ట సమీపంలో ఉన్న పొలం వద్దకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చే క్రమంలో తిరుపతివైపు వెళుతున్న స్విఫ్ట్ వీడీఐ వాహనం ఢీకొంది. దీంతో సుబ్రమణ్యం అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రైల్వేకోడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ మహేష్ తెలిపారు. మృతుడికి భార్య జయమ్మ, కుమారులు శివకుమార్, మహేష్, ఇద్దరు కుమార్తెలు మణెమ్మ, సరస్వతి ఉన్నారు. మృతుడి చిన్నకుమారుడు మహేష్ గత శనివారం నాడే బతుకుదెరువు కోసం గల్ఫ్ దేశం వెళ్లాడు. వీరందరికి పెళ్లిళ్ల అయి పిల్లలు ఉన్నారు.

### జేఎన్టీయూ మొదటి ఏడాది
## ఇంజనీరింగ్ ఫలితాల వెల్లడి



ఫలితాలు ప్రకటిస్తున్న ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు

కలికిరి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలల్లో బీటెక్ మొదటి సంవత్సరం ఫలితాలను శుక్రవారం ప్రిన్సిపాల్ వెంకటేశ్వర రావు ప్రకటించారు. మొదటి ఏడాది (2024-25) రెండో సెమిస్టర్ ఫలితాలు, 2023-24 కంపార్ట్‌మెంటల్ పరీక్షా ఫలితాలను కూడా వెల్లడించారు. కలికిరి జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలకు అటానమస్ స్థాయి దక్కిన తరువాత తొమ్మిదవ విడత ఫలితాలను వెల్లడించారని చెప్పారు. మొత్తం ఫలితాల్లో 66.23 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులు కాగా ఇందులో ఈసీఈలో 95.16 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారన్నారు. పరీక్షలు నిర్వహించిన రెండు వారాల్లోగా ఫలితాలు ప్రకటించడం ద్వారా రెండో సంవత్సరం మొదటి సెమిస్టర్ చదివే విద్యార్థులు ఈ ఫలితాలకు అనుగుణంగా విద్యా ప్రణాళికలను రూపొందించుకునే అవకాశం కలుగుతుందని ప్రిన్సిపాల్ చెప్పారు. ఫలితాలను కళాశాల నోటీసు బోర్డులోనూ, కాలేజీ వెబ్‌సైట్‌లోనూ పొందుపరుస్తామన్నారు. ఉత్తీర్ణులైన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో కళాశాలకు చెందిన వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## సోలార్ రూఫ్‌టాప్‌ను ఏర్పాటు చేసుకోండి

రైల్వేకోడూరు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): సోలార్‌ను వినియోగించుకుంటే విద్యుత్ భారం ఉండదని రాజంపేట విద్యుత్ శాఖ ఈఈ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం రైల్వేకోడూరు విద్యుత్ శాఖ కార్యాలయ ఆవరణంలో ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకంపై వినియోగదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోలార్ రూఫ్ ఏర్పాటుపై బ్యాంకులు రుణాలు ఇచ్చేందుకు ముందుకు వచ్చాయన్నారు. (సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు సామర్థ్యం లోడ్) 3 కిలోవాట్‌కు ఉత్పత్తి అయ్యే 360 యూనిట్లకు ప్రాజెక్టు ధర రూ.2,30,000, ఇందులో కేంద్ర ప్రభుత్వం రూ.78,000 ఇస్తుందన్నారు. 4 కిలోవాట్లకు 480 యూనిట్లు ప్రాజెక్టు ధర 3,00000, 5 కిలోవాట్లకు 600 యూనిట్లకు 3,50,000 ప్రాజెక్టు ధర ఉంటుందన్నారు. వీటన్నింటికి రూ.78,000 కేంద్ర ప్రభుత్వ సబ్సిడీ వస్తుందన్నారు. సోలార్ రూఫ్‌పై ఎక్కడా అపోహలు లేకుండా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. సోలార్ రూఫ్ ఏర్పాటు చేసుకుంటే 90 శాతం కరెంటు బిల్లు ఆదా చేసుకోవచ్చన్నారు. సోలార్‌ను ఉపయోగించడం వల్ల బొగ్గు ఆధారిత విద్యుత్ తగ్గుతుందన్నారు. దీంతో సహజ వనరులను భావితరాలకు పొదుపు చేసిన వాళ్లవుతారన్నారు. సోలార్ అన్‌గ్రిడ్ నెట్‌మీటర్ ద్వారా వ్యాపార రీత్యా ఇన్‌స్టాల్ చేసుకున్న వారికి రాయితీ ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో రైల్వేకోడూరు ఏడీఈ భాస్కర్‌రావు, వెలుగు సీసీ నారాయణ, బ్యాంకర్లు, విద్యుత్ వినియోగదారులు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యాన పంటల పరిశోధనలు ఏవీ?

- ఎనిమిదేళ్లుగా ఎక్కడి గొంగళి అక్కడే... వృథాగా 79 ఎకరాలు
- బోర్డుకే పరిమితమైన ఉద్యాన పరిశోధనల కేంద్రం
- అమలుకు నోచుకోని డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ ఆదేశాలు
- ఉద్యానవన శాఖ లక్ష్యం పూర్తయ్యేది ఎప్పుడో?



రీసెర్చ్ సెంటర్ భూముల సముదాయ ముఖద్వారం



భూములను పరిశీలిస్తున్న డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ మాధవి (ఫైల్)

బి.కొత్తకోట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కూరగాయలు, పూలసాగుపై శాస్త్రవేత్తలచే పరిశోధనలు చేసి నూతన వంగడాలను రూపొందించి ఉద్యానపంటల సాగులో అధిక ఉత్పత్తులు సాధించి, రైతులను ఆదుకోవాలన్న ఆశయంతో బి.కొత్తకోట మండలంలో ఏర్పాటు చేసిన ఉద్యాన పరిశోధన కేంద్రం దయనీయ స్థితిలో ఉంది. తాడేపల్లిగూడెంలోని డాక్టర్ వైఎస్సార్ హార్టికల్చర్ యూనివర్సిటీ పరిధిలో రాష్ట్రంలో 20 పరిశోధనా కేంద్రాలుండగా, అందులో రాయలసీమలోని అనంతపురం, మహానంది, అనంతరాజుపేట, పులివెందుల, బి.కొత్తకోట మండల పరిధిలోని బయప్పగారిపల్లె కేంద్రంగా నెలకొల్పిన ఉద్యాన పరిశోధనా కేంద్రం ఒకటి. ఉద్యాన పంటల సాగుపై విప్లవాత్మక మార్పులకు ఈ కేంద్రం మూలం కావాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కారణాలు ఏవైనా ప్రభుత్వ లక్ష్యం నెరవేరలేదు. ఏళ్ల తరబడి బోర్డులకే పరిమితమైంది.

> **త్వరలో పరిశోధనా కేంద్రం అభివృద్ధి**
>
> యూనివర్సిటీ నిధులతో కొంత భూమిని చదును చేశాం. ఫెన్సింగ్ వేశాం. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కోసం డీడీ కట్టాము. అది మంజూరైతే బోర్లు వేయించాలి. రాష్ట్రీయ కృషి వికాస్ యోజన (ఆర్కేవీవై) ద్వారా రూ.1.30 కోట్ల నిధులకు అప్రూవల్ అయింది. నిధులు విడుదలైతే పూర్తి స్థాయి ఉద్యాన పంటల పరిశోధనలు జరుగుతాయి.
>
> - ప్రతాప్ ఉద్యాన శాస్త్రవేత్త, బయ్యప్పగారిపల్లి కేంద్రం

**రూ.కోట్ల భూములను సమకూర్చిన టీడీపీ ప్రభుత్వం**

2017లో అప్పటి టీడీపీ ప్రభుత్వంలో మండలంలోని బయప్పగారిపల్లి పంచాయతీ పరిధిలో ప్రధాన రహదారికి ఇరువైపులా రూ.కోట్ల విలువైన 79 ఎకరాల వ్యవసాయ భూమిని సేకరించింది. ఇందులో అధునాతన భవన నిర్మాణం చేసి హార్టికల్చర్ యూనివర్సిటీ పర్యవేక్షణలో వ్యవసాయ శాస్త్రవేత్తలతో పూలు, కూరగాయల పంటలపై పరిశోధనలు జరపాలని భావించారు. ఆ పరిశోధనలను రైతులకు వివరించి, సాగుపై అవగాహన కల్పించి ఉద్యాన పంటల సాగులో నూతన సాంకేతికతతో కొత్త ఒరవడిని సృష్టించాల్సి ఉండగా అందుకు విరుద్ధంగా ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఈ పరిశోధనా కేంద్రం 8 ఏళ్లుగా నిద్రావస్థలోనే ఉంది. భూకేటాయింపు అనంతరం నిధుల కోసం ప్రతిపాదనల స్థాయిలో ఉండగానే ప్రభుత్వం మారడంతో పరిశోధనా క్షేత్ర పనులు ముందుకు సాగలేదు.



హార్టికల్చర్ రీసెర్చ్ సెంటర్ కోసం కేటాయించిన 79 ఎకరాల భూమి

**డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ ప్రకటించినా కూడా..**

డాక్టర్ వైఎస్సార్ హార్టికల్చర్ యూనివర్సిటీ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ ఎం.మాధవి ఈ ఏడాది ఫిబ్రవరి 6న బి.కొత్తకోట మండలంలోని ఈ పరిశోధనా కేంద్రానికి వచ్చారు. కేంద్ర అభివృద్ధి, కార్యకలాపాల కోసం ప్రభుత్వాలు నిధులు కేటాయించకపోవడం వల్ల పరిశోధన కార్యక్రమాలు జరగలేదని తెలిపారు. యూనివర్సిటీ నిధులు రూ.25 లక్షలతో ప్రస్తుతానికి 5 ఎకరాలలో పరిశోధనాత్మక సాగును ప్రారంభిస్తామని, నేలను చదును చేసి, కొత్త బోర్లు వేయించి పూలు, కూరగాయల సాగులో పరిశోధనల కోసం ఇద్దరు వ్యవసాయ శాస్త్రవేత్తలను నియమిస్తామన్నారు. నెల రోజుల్లో 5 ఎకరాలలో ప్రారంభిస్తామని చెప్పి నాలుగు నెలలైనా ఇంతవరకు ఎటువంటి పనులు ప్రారంభం కాలేదు.

> **కార్యాలయ భవనమూ కరువే...**
>
> ఉద్యాన పరిశోధనా కేంద్రానికి 79 ఎకరాల భూములున్నా సొంత కార్యాలయ భవనం కూడా లేని దుస్థితి నెలకొంది. పక్కనే ఉన్న సిరికల్చర్ ఫాంలో ఓ గదిని కేటాయించడంతో నామమాత్రంగా అదే కార్యాలయంగా కానిచ్చేస్తున్నారు. ప్రస్తుతం మామిడి చెట్లు ఉన్న ప్రాంతంలో 5 ఎకరాల ప్లాటు కోసం ఫెన్సింగ్ మాత్రం వేశారు. నూతన భవన నిర్మాణం ఊసేలేదు. డాక్టర్ వైఎస్సార్ హార్టికల్చర్ యూనివర్సిటీ ఉద్యానపరిశోధనా స్థానం అని బోర్డులు ఏర్పాటు చేయడం తప్ప ఎనిమిదేళ్లుగా చేసిందేమీ లేదు. ఇప్పటికైనా చేస్తారా అని రైతులు ఎదురు చూస్తున్నారు.



సిరికల్చర్ ఫాంహౌస్‌లో తాత్కాలికంగా ఉన్న రీసెర్చ్ కార్యాలయం

# సోలార్ రూఫ్‌టాప్‌తో విద్యుత్ ఆదా



గుర్రకొండలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న డీఈ చంద్రశేఖర్‌రెడ్డి

గుర్రంకొండ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రజలు, రైతులు సోలార్ రూఫ్‌టాప్‌ను ఏర్పాటు చేసుకోవడం ద్వారా విద్యుత్ ఆదాతో పాటు కరెంట్ బిల్లులను తక్కువ మొత్తంలో చెల్లించడానికి మంచి పథకమని ఈఈ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రమైన గుర్రంకొండ సబ్‌స్టేషన్‌లో రైతులు, ప్రజలతో శుక్రవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఈ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ సోలార్ రూఫ్‌టాప్ పథకంలో 1 కిలో వాట్ నుంచి 3 కిలోవాట్స్ వరకు సబ్సిడీతో ఏర్పాటు చేసుకోవచ్చునన్నారు. దీంతో ప్రజలకు కరెంట్ బిల్లుల భారం బాగా తగ్గుతుందన్నారు. సూర్యఘర్ పథకంలో విద్యుత్ ఆదాతో పాటు ఇళ్లకు కరెంట్ సమస్య ఉండదన్నారు. గ్రామాల్లో ప్రజలు పథకాన్ని సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఏడీ శివయ్య, సబ్ ఇంజనీర్ మోసీన్, సిబ్బంది పాల్గొన్నారు.

**సోలార్‌తో విద్యుత్ ఆదా..**

వాల్మీకిపురం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సబ్సిడీతో ఇస్తున్న సోలార్ రూఫ్ టాప్ నిర్మించుకోవడం ద్వారా విద్యుత్ ఆదా చేసుకోవచ్చని ట్రాన్స్‌కో ఈఈ ంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సమీపంలోని పునుగుపల్లె విద్యుత్ సబ్‌స్టేషన్ నందు ప్రధానమంత్రి సూర్యాఘర్ యోజన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటులో 1కిలోవ్యాట్‌కు 120యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి, ప్రభుత్వ సబ్సిడీ రూ.30వేలు, 2కిలో వ్యాట్‌లకు 240యూనిట్లు ఉత్పత్తి రూ.60వేలు సబ్సిడీ, 3కిలో వ్యాట్‌లకు 360 యూనిట్లు ఉత్పత్తి రూ.78వేలు సబ్సిడీలతో ఈ పథకాన్ని గృహ వినియోగ దారులకు మాత్రమే మంజూరు చేయడం జరుగుతుందన్నారు. సోలార్ ఏర్పాటు ద్వారా విద్యుత్ బిల్లును కూడా ఎంతో ఆదా చేస్తుందని గృహ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ కోసూరి చంద్రమౌళి, టీడీపీ రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టర్ వల్లిగట్ల వెంకటరమణ, జిల్లా పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు వెంకటరమణ, టీడీపీ మండలపార్టీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, ఏఈ రాజశేఖర్, సబ్ ఇంజనీర్ జాకీర్‌హుస్సేన్, నాయకులు పీవీ నారాయణ, రాజేంద్రాచారి, కోసూరి రమేశ్, శేషాద్రిరెడ్డి, బొక్కసం బ్రదర్స్, ట్రాన్స్‌కో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# వానరానికి అంత్యక్రియలు

- విద్యుదాఘాతంతో వానరం మృతి
- సంప్రదాయబద్ధంగా ఖననం
- అంత్యక్రియల్లో పాల్గొన్న హిందూ, ముస్లింలు





పాపిరెడ్డిగారిపల్లెలో చనిపోయిన వానరం, వానరానికి అంత్యక్రియలకు సిద్ధం చేసిన గ్రామస్తులు

కలకడ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన వానరానికి అంత్యక్రియలు చేశారు. కలకడ మండలం పాపిరెడ్డిగారిపల్లెలో వెలుగు చూసిన సంఘటనలోకెళితే... విద్యుదాఘాతంతో చనిపోయిన వానరానికి గ్రామమంతా ఏకమై ఘనంగా అంత్యక్రియలు నిర్వహించి మానవత్వం చాటుకున్నారు. శుక్రవారం పాపిరెడ్డిగారిపల్లె మసీదు వద్ద వానరాలు వెళుతుండగా ప్రమాదవశాత్తు ఓ వానరం విద్యుత్ తీగలకు తగలడంతో మృతి చెంది కిందపడిపోయింది.

ఇది గమనించిన స్థానికులు మనిషికి అంత్యక్రియలు చేసే విధంగానే వానరానికి అంత్యక్రియలు నిర్వహించారు. తొలుత హిందువులు అంతిమయాత్రకు ముందుకు రాగా అక్కడే ఉన్న ముస్లింలు, మహిళలు ముందుకు వచ్చి ఘనంగా ఏర్పాట్లు చేశారు.

వానరం కళేబరానికి వరిగడ్డి, కొత్త తెల్లబట్టతో పాడె కట్టి స్నానం చేయించి సుగంధ ద్రవ్యాలు చల్లడం, పూలమాలలు వేసి అగరబత్తీలు వెలిగించి, టెంకాయలు కొట్టి కర్పూర హారతులిచ్చారు. సాధారణంగా మనిషి తరహాలోనే పాడె మోస్తూ బాణాసంచా పేల్చుతూ మంగళవాయిద్యాలు, డప్పువాయిద్యాల నడుమ గ్రామస్థులు కోతికి అంతిమయాత్రను నిర్వహిస్తూ స్థానిక గొల్లపల్లె రోడ్డులో ఖననం చేశారు. కార్యక్రమంలో బోడోళ్ల రాజారెడ్డి, రహంతుల్లా, 104 రమేశ్, సమిడిశెట్టి అమరనాథ్, చంద్ర, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమంగా నాటిన మొక్కలు తొలగింపు





ప్రభుత్వ భూమిలో అక్రమంగా నాటిన మొక్కలను తొలగిస్తున్న దృశ్యం, చిట్టిబోయినపల్లెలో రోడ్డు పక్కనున్న విలువైన ప్రభుత్వ భూమిలో నాటిన మొక్కలు

- **ప్రభుత్వ భూమిలో బోర్డు ఏర్పాటు**

గుర్రంకొండ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమిలో అక్రమంగా నాటిన మామిడి, నేరెడు, టెంకాయ మొక్కలను రెవెన్యూ సిబ్బంది శుక్రవారం తొలగించారు. చిట్టిబోయినపల్లె రెవెన్యూ గ్రామంలోని సర్వే నెంబరు 87/8లో 2.30 ఎకరాల ప్రభుత్వ భూమి ని రెండు నెలల కిందట వైసీపీ నేతలు అక్రమించుకుని అమ్మడానికి సిద్ధం చేశారు. ఈ క్రమంలో ప్రభుత్వ భూమి ఆక్రమణపై పత్రికలో కథనాలు ప్రచురితమవడంతో రెవెన్యూ అధికారులు అడ్డుకుని హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. దీంతో నెల రోజులకు పైగా అక్రమార్కులు మిన్నకుండిపోయారు. ఈ నేపథ్యంలో నాలుగు రోజుల కిందట అక్రమార్కులు రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన బోర్డును తొలగించి రాత్రి పూట ప్రభుత్వ భూమిని చదును చేసి అందులో మొక్కలను నాటారు.

ఈ విషయం తహసీల్దార్ దృష్టికి వెళ్లడంతో అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని వీఆర్వోకు సూచించారు. ఈ క్రమంలో వీఆర్వో భరత్‌నాయక్ శుక్రవారం ప్రభుత్వ భూమిలో అక్రమంగా నాటిన మొక్కలను కూలీల సాయంతో తొలగించి హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేయించారు. మరోమారు ప్రభుత్వ భూమిలోకి ప్రవేశిస్తే వారిపై ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని తెలిపారు.

## జూలై 7న రైల్వే ఇన్‌స్టిట్యూట్ ఎన్నికలు

నందలూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : నందలూరు రైల్వే కేంద్రంలోని రైల్వే ఇన్‌స్టిట్యూట్‌కు జూలై 7న ఎన్నికలు జరిపేందుకు గుంతకల్ సీనియర్ డివిజనల్ పర్సనల్ అధికారి ఈనెల 12న నోటిఫికేషన్ విడుదల చేశారని రైల్వే ఇన్‌స్టిట్యూట్ సెక్రటరీ విశ్వనాథ్ తెలిపారు. శుక్రవారం మాట్లాడుతూ ఈ నోటిఫికేషన్‌లో ప్రిన్సిపల్ ఆఫీసు బేరర్స్‌గా సెక్రటరీ, జాయింట్ సెక్రటరీ, ట్రెజరర్ పోస్టులకు పోటీ చేయవచ్చునని కమిటీ మెంబర్స్‌గా ఆరుగురు పోటీ చేయవచ్చునని అన్నారు. ఈ ఎన్నికల్లో ఓటు వేయాలంటే రైల్వే ఉద్యోగి డిసెంబరు 2024 నుంచి మే 2025 వరకు ఆరు నెలలుగా కంటిన్యూగా రైల్వే ఇన్‌స్టిట్యూట్ మెంబర్‌షిప్ శాలరీలో కట్ అయి ఉండాలని, మెంబర్‌షిప్ లిస్టులో ఎవరి పేరు అయినా లేకుంటే ఈనెల 16 లోపు వెల్ఫేర్ ఇన్‌స్పెక్టర్‌కు తెలుపుకోవాలని అన్నారు. ఫైనల్ ఓటర్ల లిస్టు ఈనెల 17న ప్రచురిస్తారని, నామినేషన్ ప్రక్రియ ఈనెల 19వ తేదీ ఉదయం 10 గంటల నుంచి 23వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు స్వీకరిస్తారన్నారు. ఎలిజిబులిటీ మెంబర్స్ లిస్టును ఈనెల 25 తేదీ ప్రకటిస్తారని, నామినేషన్ల విత్‌డ్రా ఈనెల 27వ తేదీ చేసుకోవచ్చన్నారు. ఫైనల్ నామినేషన్స్ లిస్టును ఈనెల 28న ప్రకటిస్తారన్నారు. జూలై 7న ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓటింగ్ ప్రక్రి య జరుగుతుందన్నారు. అదేరోజు సాయంత్రం 5 గంటల నుంచి కౌంటింగ్ ప్రక్రియ జరుగుతుందని, గుంతకల్ డివిజనల్ అధికారులు, రైల్వే ఇన్‌స్టిట్యూట్ కేర్ టేకర్ సెక్రటరీ కె.విశ్వనాథ్ తెలిపారు.

### కుమారుడిపై అక్రమ కేసు పెట్టారంటూ...
## తండ్రి ఆత్మహత్యాయత్నం



ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతున్న వెంకటరమణను అడ్డుకుంటున్న పోలీసులు

రాయచోటి టౌన్ జూన్ 13 (ఆంధ్రజ్యోతి): బాలిక ఆత్మహత్య ఘటన కేసులో తన కుమారుడు తారకరత్నను పోలీసులు అక్రమంగా ఇరికించి జైలుకు పంపారంటూ రాయచోటి పోలీసు స్టేషన్ ఎదుట శుక్రవారం తారకరత్న తండ్రి వెంకటరమణ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. వెంటనే పోలీసులు వెంకటరమణను పోలీసుస్టేషన్ నుంచి హుటాహుటిన స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులు మెరుగైన చికిత్స కోసం రాయచోటిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఈనెల 11వ తేదీ రాయచోటి పట్టణ పరిధిలోని మిట్టవాండ్లపల్లెలో బాలిక ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటనలో ఆ బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు తారకరత్న అనే యువకుడిని అరెస్టు చేశారు. తన కుమారుడిని అనవసరంగా కేసులో ఇరికించారని మనస్థాపానికి గురై వెంకటరమణ పోలీసుస్టేషన్ ఎదుట పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. బాలిక మృతి వెనుక తన కుమారుడి పాత్ర ఏమీలేదని, రాజకీయ ఒత్తిడితోనే తమ కుమారుడిపై పోలీసులు అక్రమంగా కేసుపెట్టి జైలుకు పంపారని తారకరత్న తల్లి పేర్కొన్నారు.

**బాలిక ఆత్మహత్య కేసులో ముగ్గురి అరెస్టు**

మిట్టావాండ్లపల్లెలో ఈనెల 11వ తేదీన ఉరి వేసుకొని బాలిక ఆత్మహత్య చేసుకున్న కేసులో శుక్రవారం రాయచోటి అర్బన్ పోలీసులు తారకరత్న, వెంకటస్వామి, మణెమ్మలను అరెస్టు చేసి కోర్టులో హాజరుపెట్టినట్లు అర్బన్ సీఐ వెంకటాచలపతి తెలిపారు.

### విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ కార్యవర్గం
## నియామకానికి దరఖాస్తు చేసుకోండి

రాజంపేట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట రెవెన్యూ సబ్ డివిజన్‌లో విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ కార్యవర్గ నియామకానికి అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సబ్ కలెక్టర్ నిదియాదేవి తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవోఎంఎస్ 99, సాంఘిక సంక్షేమ శాఖ 09.12.2015న పొందుపరిచిన మార్గదర్శకాల మేరకు షెడ్యూల్డ్ కులాలు, తెగల సంఘం నుంచి ఇద్దరు, ప్రభుత్వేతర వర్గాలకు సంబంధించి మరో ఇద్దరు సభ్యుల నియామకం ఉంటుందన్నారు. అర్హులైన సామాజిక స్పృహ కలిగి వివాదరహితులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 17వ తేదీ లోపు రాజంపేట సబ్‌కలెక్టర్ కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలన్నారు.

# బడి రుణం కొంత తీర్చుదామని..!




వారంతా చదువులమ్మ చెట్టు కొమ్మలు. చదువు విలువ ఎరిగి కష్టపడి ఉన్నత శిఖరాలను అధిరోహించారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాలతో పాటు దేశ, విదేశాల్లో స్థిరపడ్డారు. కష్టపడి చదివాం, మన బతుకేదో తాము బతికేద్దాం అనుకోలేదు. తమ ఉన్నతికి పునాదిగా నిలిచిన సరస్వతి నిలయానికి వారు తమ హృదయాల్లో చోటు కల్పించారు. ఈ పాఠశాలలో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించిన సుమారు 15 మంది పూర్వ విద్యార్థులు ఒక సంఘంగా ఏర్పడ్డారు. చదువుకున్న బడి రుణం ఎప్పటికీ తీర్చుకోలేమని తెలిసినా, పదేళ్లుగా పాఠశాలలో ప్రాథమిక వసతుల కల్పనకు తమవంతు సహాయ సహకారాలు అందిస్తున్నారు

- పూర్వ విద్యార్థుల సేవానిరతి
- రూ.10 లక్షల వ్యయంతో మౌలిక వసతులు
- స్ఫూర్తిదాయకంగా పాత విద్యార్థుల సంఘం




పాఠశాలలో పూర్వ విద్యార్థులు ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్, క్రికెట్ నెట్

ప్రొద్దుటూరు రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): . . ప్రొద్దుటూరు మండలం తాళ్లమాపురంలోని జడ్పీ హైస్కూలు అప్పట్లో సమీప గ్రామాలకు ఒక్కగానొక్క ఉన్నత పాఠశాల. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి ఎందరో విద్యార్థులు ఈ పాఠశాలలో విద్యను అభ్యసించారు. అప్పట్లో పాఠశాలలో ల్యాబ్, లైబ్రరీ, తాగునీరు, మరుగుదొడ్లు ఉండేవి కావు. అప్పట్లో ఆ పాఠశాలలో చదువుకున్న సుమారు 15 మంది విద్యార్థులు తమను తీర్చిదిద్దిన బడి రుణం తీర్చుకునేందుకు నిర్ణయించుకున్నారు.

**పాత విద్యార్థుల సంఘం ఆవిర్భావం**

2015లో తొలిసారిగా పాత విద్యార్థుల సమ్మేళనానికి తొలి అడుగు పడింది. జూనియర్స్, సీనియర్స్ అనే తేడా లేకుండా సుమారు 15 మంది తాళ్లమాపురం జడ్పీ హైస్కూలు పాత విద్యార్థుల సంఘంగా ఏర్పడ్డారు. పాఠశాలలో మౌలిక వసతుల మెరుగుపై ఎప్పటికప్పుడు ప్రధానోపాధ్యాయులు, సిబ్బందితో చర్చించి పాఠశాల అభివృద్ధికి నడుం బిగించారు. రిటైర్డు హెడ్మాస్టర్ గోపీనాథరెడ్డి హయాంలో పాఠశాల అభివృద్ధి పరుగులు తీసింది. ఆయన తన హయాంలో ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు రాబట్టి, సౌకర్యాలు సమకూర్చగా మిగిలిన అంశాలను ఈ సంఘ సభ్యుల సహకారంతో కృషి చేశారు. పదవీ విరమణ అనంతరం ఆయన కూడా పూర్వ విద్యార్థుల సంఘంలో తాను ఒకరిగా చేరారు. ఆ తర్వాత వచ్చిన ప్రధానోపాధ్యాయులు కూడా పాత విద్యార్థుల కృషిని అభినందిస్తూ వారి సహాయ సహకారాలతో పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్నారు.

**మౌలిక వసతులపై దృష్టి**

పాఠశాలలో దయనీయ స్థితిలో ఉన్న మరుగుదొడ్లకు టైల్స్, గులాబి కంచె వేయించారు. తలుపులను మార్చారు. ఓవర్‌హెడ్ ట్యాంకుఏర్పాటు చేశారు. కంప్యూటర్, సిబ్బంది గదుల్లో ఫ్లోరింగ్‌కు మరమ్మతులు చేశారు. మధ్యాహ్న భోజనం కోసం సుమారు 250 ప్లేట్లను అందజేశారు. 2015 నుంచి 2019 వరకు అన్ని తరగతుల విద్యార్థులకు ప్రతి సంవత్సరం నోట్‌బుక్కులు, స్టేషనరీ అందించారు. సుమారు లక్ష రూపాయల వ్యయంతో ఆర్వో ప్లాంటును సమకూర్చారు. దీని నిర్వహణను ఏటా నిధులను అందిస్తున్నారు. ప్రతి సంవత్సరం స్వాతంత్ర్య, గణతంత్ర్య దినోత్సవాల సందర్భంగా విద్యార్థులకు పోటీలు నిర్వహించి పాఠ్యేతర కార్యకలాపాలకు ఏటా రూ.30 వేలు ఖర్చు చేస్తున్నారు. పాఠశాల లైబ్రరీకి పుస్తకాలు అందించారు. . 9, 10 తరగతుల విద్యార్థుల కోసం ప్రతి సంవత్సరం కొత్త కొశ్చన్‌బ్యాంక్ పుస్తకాలను అందిస్తున్నారు. పరీక్షలకు మార్గ దర్శనం చేసే వివిధ మ్యాగజైన్లను సమకూరుస్తున్నారు.

**క్రీడలకు ప్రోత్సాహం**

మండల, జిల్లాస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొనే విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్లు, డ్రస్సులను అందజేస్తున్నారు. విజేతలకు బహుమతులు అందిస్తున్నారు. స్కౌట్స్, గైడ్స్‌ల విద్యార్థుల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించేందుకు యూనిఫాంలను అందజేశారు. పాఠశాల కార్యాలయంలో ఇన్వర్టర్లను, ల్యాప్‌టాప్, ప్రింటర్ తదితర ఉపకరణాలను అందుబాటులో ఉంచారు. సైన్స్ ల్యాబ్ పరికరాలు, సామగ్రిని అందుబాటులోకి తెచ్చారు. నూతనంగా నిర్మించిన గదులకు సుమారు రూ.60 వేలతో టైల్స్ ఏర్పాటు చేశారు. ఇటీవల క్రికెట్ క్రీడల్లో విద్యార్థులను ప్రోత్సహించడానికి పాఠశాల ఆవరణంలో క్రికెట్ కిట్, నెట్‌పిచ్‌ను ఏర్పాటు చేశారు. బలహీనంగా ఉన్న తరగతి గది తలుపులను, తాళాలను మరమ్మతులు చేయించారు. పాఠశాల గోడలపై పెయింటింగ్ వేయించి క్రీడలు, గణితం, సైన్స్, పరిజ్ఞానం పెంచే చిహ్నాలతో కూడిన రంగుల చిత్రాలను వేయించారు. గడిచిన పదేళ్లలో రూ.9,92,844లను ఖర్చు చేశామని పాత విద్యార్థుల సంఘం తెలిపారు. సరైన దిశలో చొరవ తీసుకుని వాటిని క్షేత్రస్థాయిలో అమలు చేసేందుకు ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది, సహకారాలను తీసుకుంటున్నారు.

**అభివృద్ధికి పెద్దపీట**

హెడ్మాస్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించాను. ఇక్కడి సౌకర్యాలు, వసతులను గమనించాను. ఇందులో పాతవిద్యార్థుల సంఘం కృషి ఎంతగానో కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. పాఠశాల ఉన్నతికి ఎంత ఖర్చు అయినా వెనుకాడే పరిస్థితి లేదని ఎలాంటి అవసరమైన తమ దృష్టికి తీసుకురావాలని విద్యార్థులు నాతో కూడా సంప్రదించారు. దాతల సహకారం పాఠశాలకు పుష్కలంగా ఉంది.

- విజయకుమారి, ప్రధానోపాధ్యాయురాలు

## 'రక్తదానంతో బాధితుల్లో భరోసా..'

కడప కలెక్టరేట్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రక్తదానం చే ద్దాం.. బాధితుల్లో భరోసా నింపు దామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖా ధికారి డాక్టర్ నాగరాజు పిలుపు నిచ్చారు. శుక్రవారం ప్రపంచ రక్తదాన దినోత్సవంలో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, ఏపీ ఎస్ఏసీఎస్ ఆదేశాల మేరకు నగరంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, రీజనల్ బ్యాంకు, ప్రభుత్వ రక్తనిధి, సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్)వారి సహకారంతో మెగా బ్లడ్ డొనేషన్ కార్యక్రమాన్ని ఎస్‌బీఐ చీఫ్ మేనేజరు కృష్ణ కిశోర్‌తో కలిసి డీఎంహెచ్‌వో ప్రారంభించారు. స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా 75వ వార్షికోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ జూన్ 14వ తేదీ ప్రపంచ రక్తదాతల దినోత్సవం నిర్వహించడం జరుగుతోందన్నారు. సర్వజన ఆసుపత్రి, ఇతర బ్లడ్‌బ్యాంకు వారు వారం రోజుల పాటు స్వచ్ఛంద రక్తదాన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. రిమ్స్ బ్లడ్ బ్యాంకు వారు స్థానిక ఎయిర్‌పోర్టులో ఉదయం 10 గంటలకు రక్తదాన అభినందన కార్యక్రమాలు, రక్తదాన శిబిరం నిర్వహించడం జరుగుతోందని, రక్తదాతలు పాల్గొని విజయ వంతంచేయాలని డీఎంహెచ్‌ఓ, జిల్లా ఎయిడ్స్ కంట్రోల్ అధికారి డాక్టర్ రవిబాబులు పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజరు అనిల్‌కుమార్, బ్లడ్‌బ్యాంకు డాక్టర్ రాజేంద్ర, క్లస్టర్ ప్రోగ్రామ్ అధికారి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్మారకాలుగా చింతకుంట రేఖాచిత్రాలు

ముద్దనూరు జూన్13(ఆంధ్రజ్యోతి): చింతకుంట ఆదిమానవుడి రేఖా చిత్రాలను జాతీయ స్మారకాలుగా గుర్తించాలని అమరావతి అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ జాస్తి వీరాంజనేయులు ప్రధానమంత్రి నరేంద్రమోడీకి లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు. ఇందుకు స్పందించిన ప్రధాన మంత్రి కార్యాలయం ఆ విజ్ఞప్తిని పరిశీలించాలని కేంద్ర సాంస్కృతిక,మంత్రిత్వ శాఖకు పంపింది. ప్రస్తుతం చింతకుంట ఆదిమానవుడి రేఖాచిత్రాలు జాతీయ స్మారకాలుగా గుర్తించే ప్రక్రియ కొనసాగుతున్నట్లు తెలుస్తోంది.

## నవధాన్యాల సాగు ఎంతో లాభదాయకం

వల్లూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): వరి సాగుకు ముందు నవధాన్యాల సాగుతో లాభాలు ఉంటాయని జిల్లా పీఎండీఎస్ ప్రాజెక్టు మేనేజరు ప్రవీన్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పెద్దపుత్త గ్రామంలో స్థానిక రైతు తాడిగొట్ల రాఘవరెడ్డి పొలాన్ని ఆయన సందర్శించారు. పంట వేసుకునే ముందు భూమిలో నవధాన్యాలు సాగు చేసుకుంటే భూమిలో పోషకపదార్థాలే కాకుండా భూమి కూడా సారవంతం అవుతుందన్నారు. అలాగే పంటకు వచ్చే తెగుళ్లను కూడా అరికట్టవచ్చన్నారు. ఎరువుల వాడకం కూడా తక్కువగా ఉంటుందన్నారు. వరి సాగు చేసేముందు ఘనజీవామృతం, జీవామృతం తప్పకుండా వాడుకోవాలని సూచించారు. ప్రొఫెసరు భరత్‌కుమార్‌రెడ్డి, ఎన్‌ఎఫ్‌ఏ నరసింహారెడ్డి, వెంకట్రామిరెడ్డి, యూనిట్ ఇన్‌చార్జ్ ఓబులయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, రిసోర్స్ పర్సన్స్ విజయలక్ష్మి, ఓబులమ్మ పాల్గొన్నారు.

## తండ్రి అడుగుజాడల్లో నడుస్తా..

- సుగవాసి ప్రసాద్‌బాబు



సంస్మరణ సభలో మాట్లాడుతున్న సుగవాసి ప్రసాద్‌బాబు

చిన్నమండెం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): తన తండ్రి అడుగుజాడల్లో నడుస్తానని రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు అన్నారు. శుక్రవారం చిన్నమండెం మండల కేంద్రంలోని ఏర్పాటు చేసిన సుగవాసి పాలకొండ్రాయుడు సంస్మరణ సభకు ప్రసాద్‌బాబు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాయచోటి నియోజకవర్గంలో ఏ ప్రాంతానికి వెళ్లినా పాలకొండ్రాయుడు చేసిన అభివృద్ధి, సంక్షేమ ఫలాలే కనిపిస్తున్నాయని, తమ తండ్రి అడుగుజాడల్లోని నడుచుకుంటానని పేర్కొన్నారు. ప్రతి వ్యక్తిని పేరు పేరునా గుర్తు పెట్టుకుని పిలిచే అంత చనువు మీతో మా తండ్రికి ఉండేదన్నారు. అలాగే తనను కూడా చేరదీసి ముందుకు నడిపించాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో పారిశ్రామికవేత్త ముంబై ఏజాద్‌ఖాన్, టీడీపీ మండల తెలుగు యువత అధ్యక్షుడు తౌహిద్‌ఖాన్, రహంతుల్లా, సైపుల్లా, బాలచంద్రయాదవ్, నాగభూషణం, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## హామీలు అమలు చేయాలి

కడప మారుతీనగర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆశా వర్కర్స్‌కు ఇచ్చిన హామీ లను వెంటనే అమలు చేయాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవా ధ్యక్షుడు గుంటి వేణు గోపాల్ ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే కూటమి ప్రభుత్వం ఆశాలకు ప్రకటిం చిన హామీల జీవోలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇందుకు నిరసనగా ఏపీ ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా సమితి పిలుపుమేరకు కలెక్టరేట్ ఎదుట చేపట్టిన రిలే నిరాహారదీక్ష శిబిరాన్ని జిల్లా శ్రామిక మహిళా ఫోరమ్ కన్వీనర్ ఎన్.విజయలక్ష్మి, ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి నాగసుబ్బారెడ్డి దీక్షలో కూర్చున్న ఆశా కార్య కర్తలకు రిబ్బన్ కండువాలు వేసి శిబిరాన్ని ప్రారంభించారు. కాగా ఆశాలు చేస్తున్న రిలే నిరాహారదీక్షా శిబిరాన్ని జిల్లా లెప్రసీ అధికారి సందర్శించి ఆశాలకు రావాల్సిన లెప్రసీ అలవెన్స్ విడుదల కానున్నాయని, మరో రెండు మూడు రోజులలో అందగలవని హామీ ఇచ్చారు. అనంతరం జాయింట్ కలెక్టర్ అదితి సింగ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో యూని యన్ నగర అధ్యక్ష, కార్యదర్శులు నరసమ్మ, శాంతమ్మ, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

## అనుమానాస్పద స్థితిలో యువతి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

కలసపాడు, జూన్ 13 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని జాతివర్తిపల్లె- చింతలపల్లె మధ్యలో శుక్రవారం ఎలిజబెత్ (22) అనే యువతి అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. గ్రామస్తులు అందించిన సమాచారం మేరకు పోరుమామిళ్ల మండలం కవలకుంట్ల గ్రామానికి చెందిన నారిపోగుల ఓబయ్య కుమార్తె ఎలిజబెత్ తమిళనాడులో మహిళలు, యువతులకు కుట్టుమిషన్‌లో శిక్షణ ఇప్పిస్తూ సామాజిక సేవ చేస్తుంటుంది. రెండు నెలల క్రితం తల్లిదండ్రులు పెళ్లి సంబంధం చూడగా ఆమె తిరస్కరించింది. శుక్రవారం జాతివర్తిపల్లె -చింతలపల్ల మధ్య ప్రధాన రహదారి పక్కన ఆమె మృతదేహం పడి ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోరుమామిళ్ల, కలసపాడు పోలీసులు సంఘటన స్థలాన్ని సందర్శించి విచారణ చేస్తున్నారు. మృతురాలి సోదరుడు, బాబాయిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. మృతదేహాన్ని పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## ఉరి వేసుకుని.. వివాహిత ఆత్మహత్య

కాశినాయన, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓబుళాపురం గ్రామానికి చెందిన నీలం అనురాధ(28)అనే వివాహిత ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ యోగేంద్ర తెలి పారు. మండలంలోని చింతల పల్లెకు చెందిన అంకయ్య కూతురు అనూరాధను ఐదేళ్ల క్రితం ఓబు ళాపురం గ్రామానికిచెందిన నీలం వెంకటరమణయ్య కుమారుడు వెంకటేశ్వర్లుకు ఇచ్చి వివాహం చేశారు. వారికి ప్రస్తుతం మూడేళ్ల కూతురు ఉంది. సీఆర్‌పీఎఫ్ లో పని చేసే వెంకటేశ్వర్లు ఇటీవల సెలవుపై గ్రామానికి వచ్చి, నాలుగు రోజుల క్రితమే డ్యూటీకి వెళ్లా డు. ఈ నేపథ్యంలో శుక్రవారం మధ్యాహ్నం ఫ్యానుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఆత్మహత్యకు కారణాలు పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.

## ప్రొద్దుటూరులో వ్యక్తి..

ప్రొద్దుటూరు రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. టూ టౌన్ ఎస్ఐ ధనుంజయుడు తెలిపిన వివరాల మేరకు ప్రొద్దుటూరు పట్టణంలోని విజయనగరం వీధికి చెందిన రెడ్డివీర రవిశంకర్ (36) ఆటోడ్రైవర్. మద్యానికి బానిసై సుమారు రూ.5 లక్షల దాకా అప్పులు చేశాడు. వీటిని తీర్చే మార్గం కానరాక గురువారం ఉదయం ఇంటినుంచి ఆటో తీసుకుని వెళ్లిపోయాడు. శుక్రవారం ఉదయం జమ్మలమడుగు బైపాస్‌రోడ్డులోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న ఖాళీ స్థలంలో ఓ చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల సమాచారం మేరకు సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతుడు రవిశంకర్‌గా గుర్తించారు. అతని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ..

కడప క్రైం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కడప - కృష్ణాపురం రైల్వేస్టేషన్ల మధ్య ఓ వ్యక్తి రైలు కింద పడి మృతి చెందినట్లు కడప రైల్వే పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు మృతి చెందిన వ్యక్తి వయసు 35 ఉంటుందని,తెల్లని ఫుల్‌హ్యాండ్ చొక్కాపై నీలం రంగు పూలు ఉన్నాయని, బ్లూ కలర్ లోయర్ ధరించి ఉన్నాడని తెలిపారు. వివరాలకు రైల్వే ఎస్సై 9440900811 కు ఫోన్ చేసి మరింత సమాచారం తెలుసుకోవాలని కోరారు.

## రూ. 1.20 కోట్లతో కేసీ ప్రధాన కాలువ అభివృద్ధి



కేసీ కాల్వలో పూడిక తీస్తున్న చైర్మన్ వెంకటసుబ్బారెడ్డి

చెన్నూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కేసీ ప్రధాన కాల్వలో పూడికతీతతో పాటు, ఆయకట్టు రోడ్లు, ఉప కాల్వల అభివృద్ధి పనులకు 1,20,64,000 రూపాయలు మంజూరైంది. కేసీ ప్రధాన కాల్వలో పూడిక తొలగించడంతోపాటు ఆయకట్టు రోడ్లు బాగు చేయాలని రైతులు కోరినా ఫలితం లేకుండా పోయింది. అయితే, ప్రస్తుత ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో 15 పనులను చేపడుతున్నారు. ఇందులో కేసీ ప్రధాన కాల్వలో ఐదు చోట్ల పూడిక తీత పనులకు రూ. 39.89 లక్షలను వెచ్చిస్తున్నారు. ఈ పనుల్లో మూడు ప్రధాన కాలువకు సంబంధించినవి కాగా, మిగిలినవి చెన్నూరు, కొక్కి రాయపల్లె కాల్వలు. ఉప్పరపల్లె, ఖాదర్‌ఖాన్ కొట్టాలు, శేషయ్యగారి పల్లె, చిన్నమాచుపల్లె వద్ద ఉన్న ప్రధాన కాల్వపై ఆయకట్టు రోడ్లను వేయనున్నారు. ఈ పనులకు ఒక్కో దానికి రూ.7.97 లక్షలు మంజూరైంది. గోపవరం, చెన్నూరు, ఉప్పరపల్లె ప్రాంతాల్లో కేసీ ఉప కాల్వలకు ఆయకట్టు రోడ్లు వేస్తున్నారు. కొండ పేట చెరువుకు వెళ్లే డిస్ట్రిబ్యూటరీ కెనాల్‌లో పూడిక తీతతో పాటు రూ.7.98 లక్షలతో రోడ్డు వేయనున్నారు. చెన్నూరు ఉప కాల్వ పరిధిలో గ్యాస్ గోడౌన్ నుంచి రూ. 7.99 లక్షలతో ఆయకట్టు రోడ్డు, వల్లూరు మండలంలోని ఆదినిమ్మాయ పల్లె ఆనకట్ట వద్ద 8.99 లక్షలతో ఆయకట్టు రోడ్డు వేస్తున్నారు.

**పనులు ప్రారంభించిన డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్**

కేసీ ప్రధాన కాల్వలో పూడిక తీత పనులను డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ టి.వెంకటసుబ్బారెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ముందుగా ఆదినిమ్మాయపల్లె ఆనకట్ట నుంచి మొదలయ్యే ప్రధాన కాల్వలో పూడికతీత పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఏఏ పనులు అవసరమో, ఎక్కడెక్కడ పనులు చేపట్టాలన్న విషయాన్ని ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన స్పందించి నిధులు మంజూరు చేయించారన్నారు. ముళ్లపొదలు పెరగడంతో మూసుకుపోయి ఆయకట్టు రోడ్ల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు.

## బదిలీలు పారదర్శకంగా నిర్వహించాలి

- మెడికల్ ఆర్డీకి ఎన్జీవో సంఘ నేతల వినతి



మెడికల్ ఆర్డీకి వినతిపత్రం అందజేస్తున్న ఎన్జీవో నేతలు

కడప,కలెక్టరేట్, జూన్13,(ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్యశాఖలో బదిలీలు పారదర్శకంగా నిర్వహించాలని వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ రామగిడ్డయ్యకు ఏపీ ఎన్జీవో సంఘ నేతలు విన్నవించారు. శుక్రవారం పాత రిమ్స్‌లో సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, ఇతర జిల్లాల నాయకులు ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏపీఎన్జీవో సంఘం నాయకుల బదిలీల్లో ఆఫీసు బేరర్లకు ప్రభుత్వం ఇచ్చిన 9 ఏళ్ల మినహాయింపు ఇవ్వాలన్నారు. ఆఫీసు బేరర్లు జాయిన్ అయినప్పటి నుంచి వారి సర్వీసు కాలాన్ని లెక్కించాలని కోరారు. జీఏడీ సర్క్యులర్ మెమోలో ఈ విషయాన్ని స్పష్టంగా పేర్కొన్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో కర్నూలు జిల్లా అధ్యక్షుడు వెంగళరెడ్డి ,అనంతపురం జిల్లా అధ్యక్షుడు చంద్ర శేఖర్ రెడ్డి, రాష్ట్ర సహాధ్యక్షుడు దస్తగిరి రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రసాద్ యాదవ్, జిల్లా కార్యదర్శులు రవికుమార్, చంద్రమోహన్, బాల పుల్లయ్య, హుసేన్ రెడ్డి, వేణుగోపాల రెడ్డి, ప్రవీణ్, రాంమోహన్, పద్మనాభం వివిధ యూనిట్ల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

## వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు దుర్మరణం





రవి వినోద్ (ఫైల్ ఫొటోలు) వినీల్‌కుమార్‌రెడ్డి (ఫైల్‌ఫొటో)

కడప క్రైం/మైదుకూరు రూరల్, జూన్ 13 (ఆంధ్ర జ్యోతి): వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రెండు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందారు. కడప ట్రాఫిక్ ఎస్ఐ జయరాములు కథనం మేరకు.. కడప చలమా రెడ్డిపల్లెకు చెందిన నంద్యాల రవి (32) ప్రైవేటు పనులు చేస్తుంటాడు. రాయచోటి వినోద్ (26) ప్రైవేటు ఫైనాన్స్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఈ ఏడాది కడపకు చెందిన యువతితో అతనికి వివాహం జరిగింది. వినోద్ భార్య ప్రస్తుతం గర్భిణి. శుక్రవారం రవి, వినోద్ ఆలంఖాన్ పల్లెకు వెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా వారు ప్రయాణి స్తున్న స్కూటీని షిరిడి సాయి ఎలక్ట్రికల్స్ సంస్థకు చెందిన క్యాంపర్ రామాంజనే యపురం నుంచి ఆలంఖాన్‌పల్లె రింగు రోడ్డువైపు వెళుతూ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇరువురు అక్కడికక్కడే మృతి చెందారు. పోలీ సులు మృతదేహాలను రిమ్స్ మార్చురీకి తర లించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

**కారు ఢీకొని..**

మైదుకూరు మండలంలోని నెల్లూరు కొట్టాలుకు చెందిన కొండా వినీల్ కుమార్ రెడ్డి(44) అనే యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. గురువారం మధ్యాహ్నం పాతపాలెం వద్ద నడుచుకొంటు మైదుకూరు వైపు వస్తుం డగా వెనుక నుంచి కారు ఢీకొనగా అతను ఆసుపత్రిలో చికిత్స చేసుకొని ఇంటికి వెళ్లాడు. శుక్రవారం తెల్లవారు జామున ఉన్నట్లుండి మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

## ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ టోర్నీలో చిత్తూరు, కడప జట్ల విజయం



రణధీర్‌రెడ్డి



ఆర్జిత్‌రెడ్డి



సాయితేజశ్రీ

కడప స్పోర్ట్స్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న ఏసీఏ అండర్-19 మెన్స్ ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ మ్యాచ్‌లలో శుక్రవారం చిత్తూరు, కడప జట్లు ఆధిక్యం ప్రదర్శించాయి

**ఏసీఏ క్రికెట్ స్టేడియంలో..**

నగరంలోని వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ స్టేడియంలో టాస్ నెగ్గిన అనంతపురం జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 229 పరుగులు చేసింది. ఇందులో భువనేశ్వర్ 65 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు 33.4 ఓవర్లలో కేవలం 3 వికెట్లు మాత్రమే కోల్పోయి 231 పరుగులు సాధించి విజయ కేతనం ఎగురవేసింది. లోహిత్ లక్ష్మీనారాయణ 125 పరుగులతో నాటౌట్‌గా నిలిచి విజయంలో కీలకపాత్ర పోషించాడు.

**కేఎస్ఆర్ఎం మైదానంలో..**

కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో టాస్ నెగ్గిన కడప జట్టు 48.4 ఓవర్లలో 243 పరుగులకు ఆలౌటైంది. ఈ జట్టు క్రీడాకారులు రణధీర్‌రెడ్డి 65 పరుగులు, ఆర్జిత్‌రెడ్డి 61 పరుగులతో నాటౌట్‌గా నిలిచారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు 37.5 ఓవర్లలో 207 పరుగులకు ఆలౌటైంది. ఇందులో తోషిత్‌యాదవ్ 77 పరుగులు చేశాడు. దీంతో కడప జట్టు 36 పరుగుల తేడాతో విజయం సాధించింది.

**మహిళా క్రికెట్‌లో కడప జట్టు విజయం**

నెల్లూరులో జరుగుతున్న ఏసీఏ అండర్-15 ఉమెన్ ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ పోటీల్లో శుక్రవారం కడప- నెల్లూరు జట్లు తలపడ్డాయి. టాస్ నెగ్గిన కడప జట్టు బ్యాటింగ్‌కు దిగి నిర్ణీత 25 ఓవర్లలో 1 వికెట్ కోల్పోయి 200 పరుగులు చేసింది. ఇందులో సాయితేజశ్రీ 113 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు 25 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 115 పరుగులు చేసి ఓటమి చవిచూసింది. దీంతో కడప జట్టు 85 పరుగుల భారీ తేడాతో గెలుపొందింది.

# సమస్యలను పరిష్కరించాలి


## పదో రోజుకు చేరిన కాంట్రాక్టు కార్మికుల సమ్మె ● కాంట్రాక్టు ఇంజనీరింగ్ విభాగం రాష్ట్ర నేతలు మద్దతు


వినతి పత్రాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజకు అందజేస్తున్న యూనియన్ నేతలు

మదనపల్లె, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని రాష్ట్ర కమిటీ నేతలు కోరారు. మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం కాంట్రాక్టు కార్మికులు చేస్తున్న సమ్మె శుక్రవారం పదో రోజుకు చేరుకుంది. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక మున్సిపల్ కార్యాలయం ముందు సమ్మెతో కూడిన నిరసన చేస్తున్నారు. ఇందులో భాగంగా రోజువారీ వివిధ రూపాల్లో నిరసన చేపడుతుండగా, కార్మిక, కులసంఘాల నేతలు మద్దతు తెలుపుతున్నారు. ఈ క్రమంలో శుక్రవారం కర్నూలుకు చెందిన కాంట్రాక్టు ఇంజనీరింగ్ విభాగం రాష్ట్ర నేతలు ప్రకాష్, శ్రీనివాసులు, గగణమ్మ మద్దతు తెలిపారు. డిమాండ్లు నెరవేరే వరకూ సమ్మె కొనసాగించాలని, రానున్న రోజుల్లో ఆందోళనలు మరింత ఉధృతం చేయాలని సూచించారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకుంటే, అత్యవసర సేవలు కూడా బహిష్కరించాలని పిలుపునిచ్చారు. వంటా-వార్పుతో శిబిరంలో నిరసన తెలిపిన అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ వి.మనూజ, కమిషనర్ కె.ప్రమీలకు అందజేశారు. ఇందులో యూనియన్ నేతలు ఎలక్ట్రికల్ కుమార్, మహేష్, ఎస్.ముజుబుల్ రెహ్మాన్, కన్నయ్య, నాగరాజ, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

# ఏకలవ్య జయంతిని ప్రభుత్వమే చేయాలి

## ● ఎరుకల సేవా సంఘం


డీఆర్వోకు వినతి పత్రం అందజేస్తున్న ఎరుకల సంఘం నేతలు

కలికిరి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఏకలవ్య జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారిక కార్యక్రమంగా ప్రకటించి నిర్వహించాలని రాష్ట్ర ఎరుకల సేవా సంఘం డిమాండు చేసింది. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కలికిరి మార్కెట్ కమిటీ డైరెక్టర్ శ్రీనివాస వర్మ శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన రావుకు వినతి పత్రం సమర్పించారు. మహాభారత ఇతిహాసంలో విశిష్ట స్థానాన్ని సంపాదించి ఏకసంధాగ్రహిగా ఆదర్శమూర్తిగా ఏకలవ్యుడు నిలిచారని వినతి పత్రంలో పేర్కొన్నారు. గురు భక్తికి ప్రతీకగా నిలిచిన ఈ మహా పురుషుని జయంతిని ఏటా ఏకాదశి పర్వదినాన (ఈ ఏడాది ఆగస్టు 9న) జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర ఎరుకల సంఘం భావోద్వేగాలను, ఏకలవ్య మహారాజుతో వున్న అనబంధాన్ని గుర్తించి ప్రభుత్వమే అధికారికంగా రాష్ట్ర వ్యాప్తంగా వేడుకలు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వ లంబాడీలకు, బోయలకు ప్రతీకలుగా సేవాదళ్ నాయక్, వాల్మీకి మహర్షి జయంత్యుత్సవాలను ప్రభుత్వం నిర్వహిస్తున్న విష యాన్ని గుర్తు చేశారు. ఇదే తరహాలో అన్ని గిరిజ వర్గాలకు సాంస్కృతికంగా, చారిత్రాకంగా ప్రతీకగా వున్న ఏకలవ్య మహరాజు జయం తిని కూడా ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరారు. దీంతో గిరిజ సమాజం ఆత్మగౌరవం మరింత రాణిస్తుందన్నారు. ఆయన వెంట ఉమ్మడి చిత్తూరు జిల్లా ఎరుకల సేవా సంఘం అధ్యక్షుడు రామకృష్ణ, సంఘం సభ్యులు రమే ష్, రాంబాబు తదితరులున్నారు.

## జల్‌జీవన్ మిషన్ పనులు పూర్తి చేయండి

### ● ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ రషీద్‌ఖాన్ వెల్లడి


ఉప్పరవాండ్లపల్లెలో పనులను పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు

పెద్దతిప్పసముద్రం జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో జల్‌జీవన్ మిషన్ ద్వారా చేపడుతున్న వివిధ పనులను త్వరగా పూర్తి చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ రషీద్‌ఖాన్ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం ఆయన జేఈ బాలచంద్రాచారితో కలసి కందుకూరు పంచాయతీ పాత కందుకూరు, రాపూరివాండ్లపల్లె పంచాయతీ ఉప్పరవాండ్లపల్లెలో జరుగుతున్న జీఎల్ఎస్ఆర్ (గ్రౌండ్ లెవెల్ ట్యాంక్)లను పరిశీలించారు. జల్‌జీవన్ మిషన్ ద్వారా చేపడుతున్న ఈ పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు మంచినీటిని అందించడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. కందుకూరు, ఉప్పరవాండ్లపల్లెలో చేపడుతున్న పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలన్నారు. రంగసముద్రం సచివాలయం వద్ద చేపడుతున్న కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ (టాయిలెట్స్)లను తక్షణం పూర్తి చేయాలన్నారు. జల్‌జీవన్ మిషన్ ద్వారా మండలంలోని అన్ని గ్రామాల్లో ఇంటింటికీ మంచినీటిని అందించేందుకు ప్రభుత్వం సుముఖంగా ఉందని ప్రభుత్వ ఆదేశాలు రాగానే ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేస్తామన్నారు. ఆయన వెంట ఆర్‌డబ్ల్యూఎస్ పంచాయతీ కార్యదర్శి కొండా శివప్రసాద్, మనోహర్, శ్రీనివాసరెడ్డి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

## భారత్‌లోనే క్షయ వ్యాధిగ్రస్తులు అధికం


ప్రతిజ్ఞ చేయిస్తున్న వైద్య శాఖ సిబ్బంది

కలికిరి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోకెల్లా భారతదేశంలోనే క్షయ వ్యాధిగ్రస్తులు అధికంగా వున్నారని డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహ్మద్ రఫీ, టీబీ పర్యవేక్షకులు నాగిరెడ్డి తెలిపారు. సంద్రావారిపల్లె పంచాయతీలో సర్పంచు జాహీదా, ఎంపీటీసీ షాహీనా ఆధ్వర్యంలో శుక్రవారం టీబీ ముక్త్ భారత్ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. క్షయ వ్యాధి ఒకరి నుంచి మరొకరికి తుంపరల ద్వారా వ్యాప్తి చెందుతుందని వివరించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా గళ్ల పరీక్షలు నిర్వహించి వ్యాధి గురించి నిర్ధారణ చేస్తారని తెలిపారు. ఆ తరువాత ఆరు నెలలపాటు ఉచితంగా మందులు అందజేస్తామన్నారు. దీంతోపాటు ప్రధాన మంత్రి పోషన్ యోజన పథకం కింద పౌష్టికాహారం కోసం ప్రతి నెలా రూ. 1000 వంతున జమచేస్తామని చెప్పారు. ప్రజల చేత క్షయ వ్యాధి అప్రమత్తత గురించి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ జ్యోతి, పంచాయతీ కార్యదర్శి రేఖ, ఏఎన్ఎం జయంతి, ఆశా కార్యకర్త అనీఫా, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ప్రతి సచివాలయంలో యోగాంధ్ర నిర్వహించాలి


యోగాంధ్ర నిర్వహణపై సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న డీఎల్‌డీఓ లక్ష్మీపతి

మదనపల్లె టౌన్, జూన్ 13(ఆంధ్ర జ్యోతి): మండలంలోని 25 గ్రామ సచివాలయాల్లో యోగాంధ్ర నిర్వహించాలని డీఎల్‌డీఓ లక్ష్మీపతి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ సమావేశ భవనంలో నియోజకవర్గంలోని మూడు మండలాల సచివాలయ అడ్మిన్‌లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. విశాఖలో నిర్వహించే ఈ కార్యక్రమంలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబు సహా 5లక్షల మంది సామూహికంగా యోగా నిర్వహిస్తారన్నారు. ఇందులో భాగంగా గ్రామాల్లో కూడా ప్రజల చేత యోగాలో శిక్షణ ఇప్పించడానికి ప్రతి సచివాలయం వద్ద శనివారం ఉదయం యోగాంధ్ర నిర్వహించాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ తాజ్ మస్రూర్, ఎంఈఓలు ప్రభాకర్‌రెడ్డి, రాజగోపాల్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సౌకర్యాలతో సీబీఎస్ఈ స్కూల్ ప్రారంభం


గ్లోబల్ సీబీఎస్ఈ స్కూల్ ప్రారంభించి మాట్లాడుతున్న చైర్మన్ గోపాల్‌రెడ్డి

మదనపల్లె టౌన్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అనుమతులు, విద్యార్థులకు అన్ని సౌకర్యాలతో గ్లోబల్ సీబీఎస్ఈ స్కూల్ ప్రారంభించినట్లు స్కూల్ చైర్మన్ బి.గోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఆరోగ్యవరం వద్ద కొత్తగా నిర్మించిన భవనాల్లో గ్లోబల్ సీబీఎస్ఈ స్కూల్, బాల, బాలికలకు వేర్వేరుగా హాస్టల్ భవనాలను శుక్రవారం ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ విద్యాబోధనలో 20ఏళ్లకు పైగా అనుభవం వున్న తమకు, సీబీఎస్ఈ కోర్సులో విద్య అందించేందుకు అర్హతగల ఉపాధ్యాయులను నియమించామన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ పి.ఎస్.వీణ, ప్రిన్సిపాల్, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం : ఏఈ

మదనపల్లె టౌన్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): సీటీఎం సబ్‌స్టేషన్ పరిధిలోని ఐదు గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం వుంటుందని ఎస్పీడీసీఎల్ ఏఈ కె.రమేశ్ పేర్కొన్నారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ తీగల నిర్వహణ, తనిఖీలు నిర్వహిస్తున్నందున ఆ సమయంలో విద్యుత్ సరఫరా వుండదన్నారు. వినియోగదారులు సహకరించాలని ఏఈ ఒక ప్రకటనలో కోరారు.

### నేడు పీలేరులో...

పీలేరు రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో శనివారం మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ ఏఈ ఇలాహీ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రెండో శనివారం అయినందున సబ్ స్టేషన్ మరమ్మతుల దృష్ట్యా సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు. వెస్ట్ ఫీడర్ పరిధిలో 11కేవీ విద్యుత్ వైర్లపై ఉన్న కొమ్మలు తొలగించడం జరుగుతుందని తెలిపారు. అందరూ అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.

### నేడు వాల్మీకిపురంలో...

వాల్మీకిపురం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా శనివారం మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ రాజశేఖర్ పేర్కొన్నారు. విద్యుత్ సబ్‌స్టేషన్ల మరమ్మతులు, చెట్లు తొలగింపు, విద్యుత్ లైన్ల పునరుద్ధరణ నిమిత్తం విద్యుత్ సరఫరా అంతరాయాన్ని గమనించి సహకరించాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు.

## అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీస్కూల్ విద్య కీలకం


ప్రీ స్కూల్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న సీడీపీఓ సుజాత

తంబళ్లపల్లె, జూన్ 13(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీస్కూల్ విద్య చిన్నారులకు ఎంతో కీలక మైందని సీడీపీఓ సుజాత అన్నారు. శుక్రవారం తంబళ్లపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని తంబళ్లపల్లె, పెద్దమండ్యం, కురబలకోట మండలాల అంగన్‌వాడీ కేంద్రాలకు పీపీ-1, పీపీ-2, ఆదశిల, నవచేతన నీతి కథల ప్రీస్కూల్ పుస్తకాలను పంపిణీ చేశారు. సీడీపీఓ మాట్లాడుతూ అంగన్‌వాడీల్లో చిన్నారుల సామర్థ్యాలు పెంచేలా ఆటపాటలతో కూడిన బొమ్మలు, నీతి కథల పుస్తకాల ద్వారా విద్యా బోధన ఉంటుందన్నారు. మూడేళ్లు నిండిన చిన్నారులకు పీపీ-1, నాలుగేళ్లు నిండిన వారికి పీపీ-2 పుస్తకాలతో బోధన అందిస్తారన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో కాన్వెంట్ కంటే దీటుగా బోధన ఉంటుందని, మూడేళ్లు నిండిన చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు చంద్రకాంత, రమణమ్మ, నాగలక్ష్మీ, అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

## 'ప్రజా నేతలపై పోలీసుల ప్రతాపం దారుణం'


సమావేశంలో మాట్లాడుతున్న అంజనప్ప

ములకలచెరువు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): సామాన్య ప్రజలు, ప్రజా నేతలపై పోలీసులు ప్రతాపం చూపడం దారుణమని సీపీఐ మండల ప్రధాన కార్యదర్శి అంజనప్ప, సీనియర్ నేత వెంకటరమణనాయుడు అన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరులతో వారు మాట్లాడుతూ నిత్యం పేదల సమస్యలపై పోరాడుతున్న పీలేరు నియోజకవర్గ కార్యదర్శి వెంకటేష్‌పై పోలీసులు నిరంకుశంగా వ్యవహరించడాన్ని ఖండించారు. సమావేశంలో కార్మిక సంఘం మండల కార్యదర్శి నిజాం, రైతు సంఘం మండల కార్యదర్శి మల్లికార్జున, నాయకులు ఉత్తన్న, రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

## వేరుశనగ విత్తన కాయలు పంపిణీ


గుర్రంకొండలో రైతులకు విత్తన కాయలు అందజేస్తున్న ఏఓ, నేతలు

గుర్రంకొండ, జూన్ 13(ఆంధ్రజ్యోతి): రైతన్నలకు సబ్సిడీపై వేరుశనగ విత్తన కాయలను శుక్రవారం అన్ని రైతు సేవా కేంద్రాల్లో అందజేశారు. కే6, నారాయణి, టీసీజీఎస్ రకం విత్తనకాయలను అందజేశారు. ఎంపీడీఓ వెంకటేశులు, ఏఓ రత్నమ్మ, నేతలు జగదీష్, మహాత్మారెడ్డి, మురళీ, చలమారెడ్డి, నౌషాద్‌అలీ, చంద్రబాబు, ప్రదీప్, సుధాకర్ పాల్గొన్నారు.

## రైతులందరికీ సబ్సిడీ వేరుశనగ విత్తనాలు

వాల్మీకిపురం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సాగు దృష్ట్యా రైతులందరికీ సబ్సిడీ వేరుశనగ విత్తనాలు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని టీడీపీ రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టర్ వల్లిగట్ల వెంకటరమణ అన్నారు. జర్రావారిపల్లె రైతు సేవా కేంద్రం వద్ద రైతులకు వేరుశనగ విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ దేపాని ప్రభాకర్, నేతలు, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


జర్రావారిపల్లెలో విత్తనాలు పంపిణీ చేస్తున్న నేతలు

## నేడు శనైశ్వరస్వామికి మహాతైలాభిషేకం

వాల్మీకిపురం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): స్థానిక ధర్మపథం సమూహాలయంలో శనివారం ఉదయం షిరిడీసాయి సాలిగ్రామ తిరునారాయణ ధార్మిక సేవా ట్రస్టు ఆధ్వర్యంలో శనైశ్వరస్వామికి మహాతైలాభిషేకం చేయనున్నట్లు ట్రస్టు వ్యవస్థాపకులు శ్రీనివాసాచార్యులు పేర్కొన్నారు. ఏకవార రుద్రాభిషేకం, మృత్యుంజయ హోమం, విశేష పూజలు జరుగుతాయని భక్తులు హాజరై స్వామి కృపకు పాత్రులు కావాలన్నారు.

## పగలే వెన్నెలాయె...

### పగలే వెలుగుతున్న వీధి దీపాలు



తంబళ్లపల్లె, జూన్ 13(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వృధాను అరికట్టాలని ప్రభుత్వాలు చెపుతున్నా తంబళ్లపల్లెలో మాత్రం పక్కాగా అమలు కావడం లేదు. మండల కేంద్రంలోని ప్రధాన రహదారిలో కొన్ని రోజులుగా వీధి లైట్లు నిరంతరం వెలుగుతుండడమే దీనికి నిదర్శనం. రాగిమాను కూడలి నుంచి ప్రభుత్వాస్పత్రి వరకు పలు చోట్ల వీధి దీపాలు రాత్రి పగలు తేడా లేకుండా వెలుగుతున్నాయి. లైట్లు నిరంతరం వెలుగుతుండడంతో అడపాదడపా కురుస్తున్న వర్షాలకు పలుచోట్ల లైట్లు దెబ్బతిని ప్రధాన రహదారిలో అంధకారం నెలకొంది. దీంతో పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా వందలాది యూనిట్లు విద్యుత్ వృథా అయ్యి విద్యుత్ శాఖ, పంచాయతీలకు నష్టం వాటిల్లుతోందన్నారు. అధికారులు స్పందించి వీధి దీపాలకు ఆన్, ఆఫ్ స్విచ్చులు ఏర్పాటు చేస్తూ, లైట్లు వెలగని చోట నూతన లైట్లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## బీజేపీ నేతపై దాడి

ఓబులవారిపల్లె, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): గాదెల పంచాయతీలోని తల్లెంపల్లె బీజేపీ మండల నేత చిన్నరెడ్డి రాజగోపాల్‌రెడ్డిపై అదే గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్తలు దాడి చేశారని పోలీసులు తెలిపారు. క్షతగాత్రునికి తలపైన గాయం కావడంతో రైల్వేకోడూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## 'లేబర్ కోడ్‌లు రద్దయ్యే వరకూ పోరాడాలి'

రాయచోటిటౌన్, జూన్13(ఆంధ్రజ్యోతి): కార్మికుల నడ్డి విరిచేందుకు కేంద్రం తీసుకొచ్చిన లేబర్ కోడ్స్ రద్దు అయ్యే వరకూ ఐక్యంగా పోరాడదామని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు పిలుపునిచ్చారు. శుక్రవారం సీఐటీయూ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలు, హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తోందన్నారు. జిల్లా కార్యదర్శి భాగ్యలక్ష్మి, ఉపాధ్యక్షుడు ఓబులమ్మ, ఏపీ రమణ, వెంకట్రామయ్య, మోహరున్నీసా పాల్గొన్నారు.

## బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ తపస్విని

నిమ్మనపల్లి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): తహసీల్దార్‌గా తపస్విని శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పని చేసిన అమరనాధ్ రైల్వేకోడూరుకు బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో కురబలకోట నుంచి ఆమె నిమ్మనపల్లికి వచ్చారు. ఆమె మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో వుండి వారి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. మండలంలో జరుగుతున్న రీసర్వేను వేగవంతం చేసి భూ సమస్యలు లేకుండా చూడాలని తెలిపారు.

## సబ్సిడీతో విత్తనాలు ఇవ్వాలి

సంబేపల్లె, జూన్13(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసుకునేందుకు వేరుశనగ, వరి, సన్‌ఫ్లవర్, టమోటా, మిరప తదితర విత్తనాలను 90 శాతం సబ్సిడీతో అందజేయాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి కోరారు. సంబేపల్లె తహసీల్దార్ సుబ్రమణ్యంరెడ్డితో రైతు సమస్యలపై చర్చించి వినతి పత్రం అందజేశారు. రాయచోటి ఏరియా రైతు సంఘం అధ్యక్షుడు హరినాధ్‌నాయుడు, సంబేపల్లె మండల గౌరవాధ్యక్షుడు అర్జున్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మదన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

## దోమ కాటుతో మలేరియా వ్యాప్తి

### తలపుల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రమేష్ రెడ్డి


బండ్లవంకలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న తలపుల పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది

పీలేరు రూరల్, జూన్ 13 (ఆంధ్రజోతి): ప్లాస్మోడియం పరాన్న జీవి సంక్రమణ కలిగిన ఆడ ఎనాఫిలాస్ దోమ వల్ల మలేరియా వ్యాధి వ్యాపిస్తుందని తలపుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమేష్ రెడ్డి తెలిపారు. శుక్రవారం మలేరియా మాసోత్సవాల్లో భాగంగా తలపుల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో బండ్లవంకలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మలేరియా నియంత్రణకు అవగాహనతో కూడిన నివారణ చర్యలను ప్రోత్సహించడమే మలేరియా మాసోత్సవాల ప్రధాన ఉద్దేశమన్నారు. చలి జ్వరం, తలనొప్పి, వాంతులు ఈ వ్యాధి ప్రధాన లక్షణాలని, ఎవరూ వ్యాధి నిర్ధారణలో నిర్లక్ష్యం చేయరాదని సూచించారు. తలపుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు మెరుగైన ఉచిత వైద్యం అందిస్తున్నామని, ఈ అవకాశాన్ని పేద రోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ హెచ్ఈఓ కొండయ్య, పర్యవేక్షకులు కుసుమ, రెడ్డెప్ప, ఏఎన్ఎంలు ప్రమీల, భార్గవి, చంద్రకళ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## 'అందరికీ తల్లికి వందనం వర్తింప చేయాలి'



ప్లకార్డులు చూపుతున్న అమృత్ తేజ

పీలేరు రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులందరికీ తల్లికి వందనం పథకం అమలు చేయాలని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మద్దెల అమృత్ తేజ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తల్లికి వందనం పథకంలో కోతలు ఉండరాదన్నారు. ప్రతి విద్యార్థికీ రూ. 15 వేలు తల్లుల ఖాతాల్లో జమచేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రచారంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను యథావిధిగా అమలు చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం దేశంలోని పాఠశాలల్లో చదివే విద్యార్థుల సంఖ్యను యూడైస్ కోడ్ రూపంలో అధికారికంగా ప్రకటిస్తోందని తెలిపారు. ఇందులో ఆంధ్రప్రదేశ్‌లో 87,41,885 మంది విద్యార్థులు ఉన్నట్లు అధికారికంగా ప్రకటించారన్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం 6727164 మందికి మాత్రమే ఇచ్చిందని తెలిపారు. రాష్ట్రంలో ఇంకా 2014819 మంది విద్యార్థులకు తల్లికి వందనం నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని తెలిపారు. జిల్లా అధ్యక్షుడు సీ. సాయిసంపత్ కుమార్, చందు తదితరులు పాల్గొన్నారు.

## వార్డు పనులకు బకాయిలు చెల్లించండి

### ఎమ్మెల్యే షాజహాన్‌బాషాను అడిగిన చైర్‌పర్సన్ మనూజ

మదనపల్లె, జూన్ 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 35 వార్డులో ఏడాదిగా చేపట్టిన పనులకు కాంట్రాక్టర్లకు బకాయిలు చెల్లించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ వి.మనూజ ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌బాషాను అడిగారు. మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ చాంబర్‌లో వైసీపీ కౌన్సిలర్లతో కలసి చైర్‌పర్సన్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి, మీరు ఎమ్మెల్యేగా గెలిచి ఏడాది పూర్తయింది, మున్సిపాలిటీకి ఒక రూపాయి అయినా ప్రభుత్వం నుంచి తెచ్చారా? అంటూ ఆమె ప్రశ్నించారు. రోజూ మీరు పట్టణంలో మీరు చేస్తున్న ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు ఏ నిధులతో చేపట్టారో చెప్పాలని డిమాండ్ చేశారు. అవి మున్సిపల్ పాలకవర్గం ఆమోదించినవి కాదా? అంటూ ప్రశ్నించారు. సమావేశంలో మున్సిపల్ వైస్‌చైర్మన్లు జింకా వెంకటాచలపతి, బి.ఎ.నూర్‌ఆజాం, కౌన్సిలర్లు పెరవలి రాజేష్, ప్రసాద్‌బాబు, శ్రీనివా సులు, రేణుకమ్మ, రామిశెట్టి శివయ్య, ఏపీఎండీసీ మాజీ చైర్‌పర్సన్ జి.షమీం అస్లాం, గుండ్లూరు రఫీక్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

## విమాన ప్రమాద మృతులకు శ్రద్ధాంజలి


కొవ్వొత్తులతో శ్రద్ధాంజలి ఘటిస్తున్న దృశ్యం

నందలూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాదులో జరిగిన విమాన ప్రమాద ఘటనలో మృతుల కుటుంబాలకు శుక్రవారం రాత్రి అరవపల్లెలోని ఆర్ఎస్ రోడ్డులో లయన్స్‌క్లబ్, వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులు వెలిగించి శ్రద్ధాంజలి ఘటించారు. ఎస్ఐ మన్నెం రామ్మోహన్, వాకర్స్ కార్యదర్శి ఉప్పుశెట్టి సుధీర్ మాట్లాడుతూ ప్రమాదం ఊహించని పరిణామమని, మృతుల కుటుంబీకులకు ప్రగాఢ సంతాపం తెలియజేశారు. విభ ఎరుడైట్ స్కూల్ చైర్మెన్ డాక్టర్ జయభాస్కర్‌రావు, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు కుర్రా మణియాదవ్, మోడపోతుల రాము, గురుప్రసాద్, గండికోట కృష్ణకుమార్, కానకుర్తి వెంకటయ్య, కొత్తపల్లె రాజాచారి, తాటి సుబ్బరాయుడు, ఆంజనేయులు, మేస్త్రీ శంకర్, సయ్యద్ అమీర్, ఆనాల మధు, పుత్తా వెంకటేశ్, కొండిశెట్టి సుదర్శన్, యంబలూరు ప్రదీప్, చామంచి పెంచలయ్య, పసుపులేటి సుబ్రమణ్యం, ప్రజా ప్రతినిధి మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అడ్మిషన్లు

చిట్వేలి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల ప్రవేశాలు ప్రారంభమయ్యాయి. ప్రధానోపాధ్యాయులు బి.దుర్గరాజు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు అడ్మిషన్ల ప్రక్రియను నిర్వహిస్తున్నారు. పాఠశాలకు అనుబంధంగా బాలురులకు సమీకృత వసతి గృహం, బాలికలకు మూడు వసతి గృహాలు ఉన్నాయని, వివిధ ప్రాంతాల నుంచి కూడా విద్యార్థులకు పాఠశాలల్లో చేరుతుంటారన్నారు. ఇప్పటివరకు పాఠశాలలో 40 అడ్మిషన్లు జరిగినట్లు ప్రధానోపాధ్యాయులు తెలిపారు.